ఆగస్టు 6న ప్రాజక్టుల మహాసభను జయప్రదం చేయండి

కరపత్రాలు విడుదలలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పిలుపు

విశాలాంధ్ర-కడప రూరల్ : రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న గాలేరు-నగరి, తెలుగుగంగ, రాజోలి (కె.సి కెనాల్), హంద్రీనీవా, వెలిగొండ ప్రాజెక్టులు, పంటకాల్వల పూర్తికి నిధులు, నికర జలాలు కేటాయించి ప్రతి గ్రామానికి త్రాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీరు అందించి కరువు, వలసలు, ఆత్మహత్యల నుండి శాశ్వత విముక్తి చేయాలని సిపిఐ దశలవారి పోరాటాల ను జయప్రదం చేయాలని బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన కరపత్రాలు విడుదల లో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 67.4 వేల చ.కీ.మీ. వైశాల్యం, 1కోటి 51లక్షల 84 వేల జనాభా, 90 లక్షల సాగుయోగ్యమైన భూమి కలిగిన రాయసీమలో తగినంత వర్షపాతం నమోదుకాక పంటలు ఎండిపోయి కరువువాతన పడటం, ఒక వేల అదును దాటి అరా కొరగా సాగుచేసిన పంటలను అకాల వర్షాలు పొట్టన పెట్టుకుంటున్నాయి. వేసవి ఆరంభంలోనే భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయి గుక్కెడు మంచినీటికోసం పదుల కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. గత పది సంవత్సరాల కాలంలో సాధారణ సాగు విస్తీర్ణం 8 లక్షల ఎకరాలు దాటడంలేదంటే నీటి సమస్య ఎంత తీవ్రంగా ఉన్నదో అర్థమవుతుంది. సీమ నీటి కష్టాలు పోవాలంటే కృష్ణా జలాలు రాయలసీమకు మళ్లించాలని చేపట్టిన వీరోచిత పోరాటాల ఫలితంగా నిర్మిస్తున్న గాలేరు-నగరి, హంద్రీనీవా, తెలుగుగంగ, కె.సి కెనాల్ చివరి ఆయకట్టు స్థిరీకరణకు రాజోలి ప్రాజక్టులు పాలకుల నిర్లక్ష్యానికి గురై పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రాజక్టు పనులు సకాలంలో పూర్తి కాకపోవడంవల్ల అంచనా వ్యయం అమాంతం పెరిగిపోవడమే కాకుండా ప్రాజక్టులకు నీటికేటాయింపుల్లో అన్యాయం జరుగుతున్నది.అంతర్రాష్ట్ర నీటి వివాదాల చట్టం - 1956 అనుసరించి కృష్ణానది నీటి వివాదాలపై భారత ప్రభుత్వం 1969లో ఏర్పాటు చేసిన భచావత్ ట్రిబ్యునల్ 100 సం.రాల నీటి ప్రవాహం వివరాలతో 75% నీటి లభ్యత ఆధారంగా 2130 టియంసిలుగా లెక్కగట్టి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్కు 811 (కోస్తాకు 378.47, రాయలసీమకు 122.70, తెలంగాణకు 247.99 టియంసిలు), కర్ణాటకకు 734, మహారాష్ట్రకు 585 కేటాయించింది. మిగులు జలాలను వాడుకునే వెసులుబాటును దిగువ రాష్ట్రమయిన ఆంధ్రప్రదేశ్కు కల్పించడంతో పాటు నీటి కేటాయింపులను ఆయా రాష్ట్రాల పరిధిలో సర్దుబాటు చేసుకునే వెసులుబాటును కూడా కల్పించింది.రాయలసీమకు కేటాయించిన 122.70 టియంసిల నీటిలో 2 లక్షల 92 వేల ఎకరాల ఆయకట్టు కలిగిన కె.సి కెనాలు 39.9, హెచ్ఎల్సికి (మైలవరం, పిబిసి) 32.50, ఎల్ఎల్సికి 29.50, బైరవానితిప్ప 4.90, గాజులదిన్నె 2,00, 98 వేల 310 ఎకరాల ఆయకట్టు కలిగిన మైనర్ ఇరిగేషన్ 13.90 టియంసిలు తుంగభద్ర డ్యాం నది నుండి రావాల్సి వుండగా డ్యాం నిలువ సామర్థ్యం తగ్గిపోవడం, ఎగువ, దిగువ కాలువలు కర్ణాటక సరిహద్దులో ప్రయాణించే క్రమంలో అవరోధాల వల్ల నికర జలాలు కూడా చివరి ఆయకట్టుకు అందని పరిస్థితి నెలకొన్నది. రాష్ట్రానికి కేటాయించిన నీటిలో ఎ సర్దుబాటు చేయబడిన శ్రీశైలం కుడికాలువకు 19 టియంసిలు, కె.సి కెనాల్ చివరి ఆయకట్టుకు 10 టియంసిలు శ్రీశైలం నుండి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా తీసుకోవాలని అందుకోసం శ్రీశైలం కనీస నీటిమట్టం 854 అడుగులు అమలుకు నోచుకోకపోగా అడుగడుగునా ఉల్లంఘించబడు తున్నది. మిగులు జలాలపై ఆధారపడి నిర్మిస్తున్న 38 టియంసిల సామర్థ్యంతో, 2 లక్షల 60 వేల ఎకరాలకు సాగునీరు, 5లక్షల ఎ మందికి త్రాగునీరు అందించేందుకు చేపట్టిన గాలేరు-నగరి, 59 టియంసిల సామర్థ్యంతో, 5 లక్షల 75 వేల ఎకరాలకు సాగునీరు, మద్రాసుకు త్రాగునీరు అందించేందుకు చేపట్టిన తెలుగుగంగ, 40 టియంసిల సామర్థ్యంతో, 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి త్రాగునీరు అందించేందుకు చేపట్టిన హంద్రీనీవా, 43.5 టియంసిల సామర్థ్యం, 4 లక్షల 47 వేల 300 ఎకరాలకు సాగునీరు, 15.25 లక్షల మందికి త్రాగునీరు అందించేందుకు చేపట్టిన వెలిగొండ ప్రాజక్టుల భవిష్యత్తు 2004లో నియమించబడి 2010లో 65% నీటిలభ్యత ఆధారంగా మిగులు జలాలను కూడా 448 టియంసిలుగా లెక్కగట్టి మహారాష్ట్రకు 81, కర్నాటకకు 177, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్కు 190 టియంసిలు కేటాయిస్తూ వెల్లడించిన బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ సీమ ప్రాజక్టులపై మరణ శాసనం చేసింది. తెలుగుగంగకు 25 టియంసిలు కేటాయించినప్పటికీ మిగిలిన ప్రాజక్టుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మార్చింది. ట్రిబ్యునల్ తీర్పు అమలు చేస్తే రాయలసీమ తీవ్రంగా నష్టపోతుందని ఏ.పి ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేసిన తరువాత రాష్ట్ర విభజనానంతరం తెలంగాణా ప్రభుత్వం కూడా బాగస్వామి అయ్యింది. కోర్టులో వాధనలు ఒకవైపు కొనసాగుతుండగా కేంద్రప్రభుత్వ వైఖరి చెప్పాలన్న కోర్టు ఆదేశాలను మోడీ ప్రభుత్వం ట్రిబ్యునల్ తీర్పు యధావిదిగా అమలు చేయాలని చెప్పడమే కాకుండా కర్నాటక అక్రమంగా చేపట్టిన ఎగువభద్ర ఎత్తిపోతల పథకానికి జాతీయ హెూదా కల్పించి నిధులు కేటాయించడం, రాయలసీమ ఎత్తిపోతలపై అభ్యంతరాలు తెలుపడం, ఫిర్యాదు చేయడం చూస్తే బిజెపి పాలనలో రాయలసీమ ప్రయోజనాలు మంటగలుస్తున్నాయని స్పష్టంగా అర్థమవుతుంది.ఇటు నికర జలాలు రాక, అటు మిగులు జలాలు కేటాయించకపోతే నిత్య కరువులతో తల్లడిల్లుతున్న రాయలసీమకు నీటి వెతలు తీరాలంటే రాష్ట్రంలో నీటి సర్దుబాట్లు జరిగాల్సిన అవసరమున్నది. అందుకోసం గోదావరి నదీ జలాలు కృష్ణా డెల్టాకు తరలించి తద్వారా శ్రీశైలం నుండి కృష్ణా నీటిని రాయలసీమకు తరలించేందుకు అవకాశం ఉన్నది. ఇది జరగాలంటే జాతీయ హెూదా కలిగిన పోలవరం ప్రాజక్టు పూర్తి స్థాయి నీటిమట్టంతో నిర్మించాలి. ఇక్కడ కూడా బిజెపి ప్రభుత్వం రోజుకొక షరతు పెట్టి నిధులు కేటాయించకుండా నష్టపరిహారం, పునరావాసం, విద్యుత్ ఉత్పత్తి ఇవేవీ తనకు సంబంధం లేదంటూ కుంటిసాకులు వెతుకుతున్నది. కేంద్రంపై వత్తిడి పెంచి రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు కాపాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం పునరావాసం చెల్లించాల్సి వస్తుందన్న కారణంతో సామర్థ్యాన్ని తగ్గించే కుట్రలకు పాల్పడుతున్నది.బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు ఒకవైపు, భచావత్ ట్రిబ్యునల్ తీర్పుకు విరుద్ధంగా కర్నాటక, తెలంగాణా చేపట్టిన అక్రమ ప్రాజక్టులు మరో వైపు పొంచి ఉన్న ప్రమాధాన్ని ఇప్పటికైనా పాలక ప్రభుత్వాలు గుర్తించి మన రాయలసీమ ప్రాజక్టులకు తగినన్ని నిధులు కేటాయించి, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయకపోతే హక్కులు, అవకాశాలను కోల్పోయిన రాయలసీమ ప్రజానీకం మరోమారు నష్టపోయే ప్రమాధమున్నది.నికర జలాలు, మిగులు జలాలపై నిర్మితమౌతున్న ప్రాజక్టుల పరిస్థితే ఇలా ఉంటే డిపిఆర్ సిద్ధం చేసిన గుండ్రేవుల, రాయలసీమ ప్రజల ఆకాంక్ష సిద్ధేశ్వరం అలుగు ఆచరణలో మన పాలక ప్రభుత్వాలు ఎన్నడు నెరవేరుస్తాయో భవిష్యత్ ఉద్యమాలపై ఆధారపడి ఉన్నది. దివంగత ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర్రెడ్డి చేపట్టిన రాయలసీమ ప్రాజెక్టు పనులు పురోగతి సాధించినప్పటికీ వారి అకాల మరణానంతరం ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయాయి తిరిగి తన తండ్రి తలపెట్టిన జలయజ్ఞం పనులు తాను పూర్తిచేసి కరువు నుండి శాశ్వత విముక్తి చేస్తానని చెప్పిన జగన్మోహన్రెడ్డి అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలయినా ఇదివరకే వేసిన శిలాఫలకాలకే మళ్ళీ శంఖుస్థాపలు చేసుకుంటూ ప్రాధాన్యతా క్రమంలో ప్రాజక్టులు పూర్తి అయిన వాటికి పంటకాల్వల నిర్మాణం, ప్రాజక్టుల రెండో దశ పనులు పూర్తి చేయడానికి తగినన్ని నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. కృష్ణా నదిలో 35 రోజుల వరద కాలపరిమితిలో రాయలసీమ నీటి అవసరాలకు తగ్గట్టు ప్రాజక్టుల సామర్థ్యం రూపొందించబడలేదని వృధాగా సముద్రంలో కలుస్తున్న వరద నీటిని తక్కువ కాలంలో ఎక్కువ నీటిని తరలించేందుకు చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకం అవరోదాల నడుమ అర్థాంతరంగా ఆగిపోయింది. గాలేరు నగరిలో అంతర్భాగమయిన గండికోట, వామికొండ, సర్వరాయ సాగర్, చిత్రావతి, పైడిపాలెం, మైలవరం, తెలుగుగంగలో అంతర్భాగమయిన ఎస్.ఆర్-1,2, బ్రహ్మంసాగర్లో నీళ్ళున్నా పంటకాల్వల నిర్మాణం లేకపోవడం, చిన్న మరియు మధ్యతరహా ప్రాజక్టులకు, చెరువులకు అనుసంధానం లేక అదనంగా ఒక్క ఎకరా ఆయకట్టుకు నీరందని దుస్థితి నెలకొన్నది అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్. నాగ సుబ్బారెడ్డి, ఎన్. వెంకట శివ, ఎంవి సుబ్బారెడ్డి, సి.సుబ్రహ్మణ్యం, సి.బషీరున్నిసా, జి.వేణుగోపాల్, కేసి బాదుల్ల, బందల ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే అజెండా: ఎమ్మెల్యే సుధీర్

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని అందులో భాగంగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా నేరుగా ప్రజలను కలుసుకొని వారి ఇబ్బందులను గుర్తించడం జరుగుతోందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పేర్కొన్నా రు. బుధవారం ఆరవ సచివాలయ పరిధిలోని షాదీఖానాలో మున్సిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన సురక్ష కార్యక్రమం జరిగింది. కౌన్సిలర్లు రామాంజనేయులు, పెన్నా రషీద్, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు యూసఫ్, కోకోకోలా గౌస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు దరఖాస్తుదారులకు మంజూరైన ధృవీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ, వాలంటీర్ వ్యవస్థల ద్వారా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు మరో వైపు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందని గుర్తుచేశారు. ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే విపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నాలుగేళ్ల వైసీపీ పాలనలో ప్రతి సమస్యకు పరిష్కారం చూపడం జరుగుతోందని ఇప్పటికే 99శాతం మేర హామీలు నెరవేర్చడం జరిగిందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం జరుగుతోందని ఆయన గుర్తుచేశారు. రూ.6లక్షలు గడపగడపకు నిధులతో షాదీఖానా ప్రహరీ గోడ నిర్మించడం జరుగుతుందని షాదీఖానా మరమ్మత్తు పనులకు తన సొంత నిధులు రూ.2లక్షలు అందజేస్తానని ప్రజల హర్షధ్వానాల మధ్య ఎమ్మెల్యే ప్రకటించడం గమనార్హం. అంతకుముందు నాయకులను దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమీషనర్ పగడాల జగన్నాథ్, ఆర్ఓ గంగిరెడ్డి, మేనేజర్ పుల్లయ్య, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలపై ఆరా
సురక్ష కార్యక్రమంలో జేసీ

విశాలాంధ్ర-యర్రగుంట్ల : మండల పరిధిలోని కలమల్ల గ్రామం సచివాలయం-1 పరిధిలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ సంక్షేమ పథకాల అమలు, సమస్యల పై ఆరా తీశారు. నేరుగా ఆయన ప్రజలతో మాట్లాడారు. పలు ప్రశ్నల ను సంధించి ప్రజల నుండి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా జేసీ మాట్లా డుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తోందని వివరిం చారు. కార్యక్రమం ద్వారా 11 రకాల ధృవీకరణ పత్రాలను ఎటువంటి సేవా రుసుం లేకుండా మంజూరు చేయడం జరుగుతోందన్నారు. అనం తరం స్థానిక అధికారులు ధృవీకరణ పత్రాలను లబ్దిదారులకు అంద జేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మీ, మండల తాహసీల్దార్ నాగేశ్వరరావు, ఈవోపీఆర్డీ రంతుల్లయ్య, గ్రామ సర్పంచ్, పంచా యతీకార్యదర్శి సాంబశివారెడ్డి, సచివాలయఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

భౌతిక శాస్త్రంలో అంతర్జాతీయ పరిశోధన అవార్డ్

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : పోరుమామిళ్ల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగాధిపతిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ కె వెంకట రావు "వర్ణపట శాస్త్రం మరియు పదార్థాల విశ్లేషణ" రంగంలో చేసిన పరిశో ధనలకు అంతర్జాతీయ ఆసియా పరిశోధన అవార్డు తమిళనాడులోని తిరుచ్చిలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో "అంతర్జాతీ య అత్యుత్తమ పరిశోధన అవార్డ్" స్వీకరిం చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నరేష్ గారి అధ్యక్ష తన అభినందన సమావేశం నిర్వహించి వారి పరిశోధన సేవలను అభినందించినారు. ఈ సమావేశంలో పలువురు అధ్యాపకులు మాట్లా డుతూ డాక్టర్ కె. వెంకట రావుకి అవార్డ్ రావడం ఎంతో అభినం దనీయమని వారి పరిశోధనలు యువ పరిశోధనకులకు మార్గ దర్శకం అవుతాయని కొనియాడుతూ ఆయన ఆధ్వర్యంలో ముగ్గురు రీసెర్చ్ స్కాలర్స్ ఉండటం కళాశాలకు గర్వకారణమన్నారు. ఈ సమావేశ అనంతరం డాక్టర్ కె. వెంకట రావుని ప్రిన్సిపల్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పూలమాలతోను, దుశ్శాలువాతోను సన్మానించారు.

విద్యార్థులకు వైఎస్సార్ చిరునవ్వు కిట్ పంపిణీ

విశాలాంధ్ర- బ్రహ్మంగారి మఠం: మం డల పరిధిలోని కందిమల్లాయి పల్లె పాఠ శాల లో చదువుతు న్న విధ్యార్థులకు దంత, నోటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించేందుకు ప్రభుత్వం జులై 8న ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ చిరునవ్వు కార్యక్రమం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో విధ్యార్థులకు వైఎస్సార్ చిరునవ్వు కిట్‌ని ఈ ప్రాజెక్ట్ మండల ట్రైనీ ముండ్లపాటి విజయ్, భాస్కర్ అంద చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి లోపు విధ్యార్థులకు ఉచితంగా పేస్ట్, బ్రెష్, 21రోజుల టైం టేబుల్ చార్జ్ విధ్యార్థుల కు ఉచితంగా ప్రభుత్వం ఇస్తుందని రాబోయే రోజుల్లో ప్రభుత్వం 2000జనాభాకు ఒక యూనిట్‌గా తీసుకొని ఒక దంత వైద్యశాల ఏర్పాటుచేసే యేచనలో ప్రభుత్వం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులు, విధ్యార్థులకు పంటి ఆరోగ్యంపై అవగాహణ కల్పించారు. ఈ కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు నిర్మలాదేవి, ఉపాధ్యాయులు లెక్కల కొండారెడ్డి, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రావు, వైఎస్సార్ చిరునవ్వు ప్రాజెక్ట్ ట్రైనీ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

వారంలోపు సిటీ ఫారెస్టును అందుబాటులోకి తేవాలి: ఓఎస్డీ

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణంలో నిర్మాణదశలో ఉన్న సిటీ ఫారెస్టు (రాణీతోపు)ను వారంలోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఓఎస్డీ అనిల్ కుమార్‌రెడ్డి సూచించారు. పట్టణంలో నిర్మాణం చేపట్టిన షాపింగ్ కాంప్లెక్సు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. త్వరితగతిన నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు విశదీకరించారు. అలాగే పట్టణ నడిఒడ్డున ఉన్న ఆంజనే యస్వామి ఆలయ వెనుక బాగంలో నిర్మాణ పనులు చేపట్టే విధానాలపై అధికారులకు మెళకువలు వెల్లడించారు.అదే విధంగా ఏ విభాగానికి ఎంత రుసుము వసూలు చేయాలన్న అంశంపై వారంలోపు నిర్ణయించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ మహేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనరు నరసింహారెడ్డి, ఈఈలు సిద్దారెడ్డి, చెన్నకేశవరెడ్డి, మోడల్ టౌన్ మేనేజరు కృష్ణకుమార్, రాజ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

భవాన నిర్మాణ కార్మికుడి మృతి

విశాలాంధ్ర-కడప రూరల్ : కడప నగరం 48వ డివిజన్ పరిధిలోని ఆచారి కాలనీలో ఇంటి స్లాబ్ పూర్తయి మరొక ప్రాంతానికి లిఫ్టును తరలించమని మెస్త్రి ఎల్ఐసి కార్మికులపై ఒత్తిడి సందర్భంలో లిఫ్టుకు కరెంటు సర్వీస్ వైర్ క్రింద ఉన్నందు వలన తగులుకొని ప్రమాదం జరిగి వీరేష్ (38) అనే భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. లిఫ్ట్ మేస్త్రి ఎల్ఐసి నిర్లక్ష్యంగానే వీరేష్ మృతి చెందాడని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ (ఏఐటీయూసీ) కే లింగన్న ఆరోపించారు. కేసు నమోదు చేయకుండా కొంతమంది మేస్త్రీలు పోలీసు వారిని మేనేజ్ చేసి చనిపోయిన కార్మికుని కుటుంబంతో పంచా యతీ పెట్టి పోస్ట్ మార్టం నిర్వహించకుండా కర్నూలు జిల్లాకు తరలించా రు. చనిపోయిన భవనిర్మాణ కార్మిక కుటుంబం కడు పేదరికము, చదువురాని నిరుద్యోగులు కావడం మూలంగా కుటుంబ సభ్యులకు అన్యాయం చేసారని ఆదుకోవాలని కోరారు.

ఐటిఐలో రెండో విడత అడ్మిషన్లకు దరఖాస్తులు

విశాలాంధ్ర-వేంపల్లె: చక్రాయపేట ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటిఐ)లో రెండో విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానించనున్నట్లు ప్రిన్సిపల్ రాధాకృష్ణయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి సంబంధించి ఐటిఐలో సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు పదో తరగతి పాసై 40సంవత్సరాల వయసు కలిగి అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను పంపాల్సి ఉందన్నారు. పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, కుల ఆదాయ ద్రువీకరణ పత్రాలు, పాస్‌పోరుట సైజు పోటోలు జిరాక్సు కాపీలతో అభ్యర్థులు ఐటిఐ వద్దకు వచ్చి ఆన్‌లైన్ ద్వారా ఉచిత దరఖాస్తులను పొందవచ్చన్నారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

లింగాల ఐటిఐలో: లింగాల ప్రభుత్వ ఐటిఐల రెండో విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానించనున్నట్లు ప్రిన్సిపల్ శాంతయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 31వ తేదీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని టెన్త్ ఉత్తీర్ణులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధితురాలికి ఆర్థిక సహాయం అందజేత

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : రాజంపేట యువ నాయకుడు మేడా విజయ శేఖర్ రెడ్డి (మేడా పెద్దబాబు) ఒంటిమిట్ట గ్రామానికి చెందిన మద్దులత గత కొద్ది రోజులుగా బోదకాలు వ్యాధితో అస్వస్థత గురవుతున్నడంతో విషయం తెలుసుకున్న మేడ విజయ శేఖర్ రెడ్డ బుధవారం నాడు ఒంటిమిట్టకు చేరుకొని ఆమెను పరామర్శించి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోదకాలు వ్యాధితో బాధపడుతున్న మధులత లాంటి మహిళలు రాష్ట్రంలో ఎందరో ఉన్నారని ఇలాంటివారిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి సీఎం రిలీఫ్ ఫండ్, ద్వారా, లేక ఆరోగ్యశ్రీ కింద, వైద్యం అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట మండల యువ నాయకులు దిలీప్, మేడా విజయభాస్కర్‌రెడ్డి అనుచరులు, అభిమానులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సంఖ్య తగ్గించే కుట్రలో ప్రభుత్వం

విశాలాంధ్ర-కొండాపురం: గండికోట ప్రాజెక్ట్ కింద ముంపునకు గురైన మొదటి 14గ్రామాలకు జగన్‌మోహన్ రెడ్డి ఇస్తానని మాట ఇచ్చిన రూ.3.25లక్షల ప్యాకేజీ 4సంవత్సరాలు గడిచిపోయినప్పటికి ఇంతవరకు ఇవ్వకపోగా ఇప్పుడు పరిహారం పొందాలంటే 2004-2007మధ్య కాలం నాటి రేషన్ కార్డు, ఓటర్‌కార్డు కావాలని మెలికపెట్టడం ఏంటని తెలుగుదేశం పార్టీ జమ్మలమడుగు నియోజికవర్గం ఇంచార్జ్ దేవగుడి భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావే శం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004లో రాజ శేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక గండికోట ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారని అన్నారు. ఆ సమయంలో 2004-2007మధ్యలో గ్రామాల్లో సోషియే ఎకనామిక్ సర్వే చేసి నిర్వాసితుల సంఖ్య గుర్తించి గెజిట్ విడుదల చేశారు. దాని ఆధారంగా రూ.1లక్ష 86వేలు ప్యాకేజీ అందచేశారని అన్నారు. అనంతరం 2014లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టాక నిర్వాసితుల కష్టాలు గుర్తించి అదే గెజిట్‌తో ప్యాకేజిని రూ.6.75లక్షలకు పెంచడంతో పాటు మేజర్ అమ్మాయిలకు అప్పటి ప్రభుత్వం ప్యాకేజీ ఇవ్వకపోవడంతో ఎన్నో కుటుంబాలు ఇబ్బందులు పడేవని అన్నారు. వైఎస్సార్ కాంగ్రేస్ పార్టీ ప్రభుత్వం నిర్వాసితుల సంఖ్యను తగ్గించే కుట్రలో భాగంగానే 18సంవత్సరాల క్రితం(2004-2007)స్థానిక ఆధారా లు కావాలని మెలికపెట్టారని ఆయన మండిపడ్డారు. అంతేకాకుండా అన్ని అర్హతలు కలిగి సోషియే ఎకనమిక్ సర్వే నందు పేర్లు లేని వారు నేటికి కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారని అన్నారు. వారి సమాచారం అధికారు ల వద్ద ఉన్నప్పటికి వారికి ఎకనమిక్ జాబితాలో చేర్చకపోవడంతో ప్యాకేజి అందక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. 2019ఎన్నికల సమయం లో రూ.10లక్షల ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చి, ప్యాకేజి ఇవ్వడానికి నెల ముందు కటాఫ్ తేదిని పెంచి ఇస్తామని చెప్పి ఇప్పుడు 4సంవత్సరాల తరువాత ఇలాంటి షరతులు విధించడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో చెక్కులు తీసుకున్న ప్రతి ఒక్కరికి ప్యాకేజి ఇవ్వాలని అప్పట్లో రాని వారికి రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నాగేశ్వరరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ గోరుశెట్టి బాబు, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శిగా వై.వెంకటసుబ్బయ్య

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : రాష్ట్రోపాధ్యాయ సంఘం కడప జిల్లా శాఖ కార్యవర్గం బుధవారం సాయంత్రం ఎస్ టి యు భవన్ నందు సమావేశమై జిల్లా ప్రధాన కార్యదర్శిగా వై.వెంకటసుబ్బయ్య మైదుకూరు గారిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సమావేశంను ఉద్దేశించి రాష్ట్ర బాధ్యులు మల్లు రఘునాథ రెడ్డి,జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి గారులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఎస్టీయు ఒక చుక్కానిలా పనిచేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 12 వ పీఆర్‌సీ కమీషన్ ను స్వాగతిస్తున్నామని అయితే 11 వ పీఆర్‌సీ బకాయిలు ఇంతవరకు విడదల చేయలేదని 2019 జులై నుండి 2021 జులై వరకు 54 నెలల డీఏ బకాయిలు చెల్లించకుండా వాటిపై స్పష్టత ఇవ్వకుండా దాటవేత దోరణిలో వ్యవహరిస్తూ ఉండటం భావ్యం కాదని సమావేశం అభిప్రాయ పడింది. త్వరితగతిన డీఎస్సీ ప్రకటించి నియామకాలు పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు సురేష్ బాబు,గురుకుమార్,ఇలియాస్ భాషా, వెంకట సుబ్బయ్య,సంగమేశ్వర రెడ్డి, రవిశంకర్ రెడ్డి,మహబూబ్ భాషా, శివారెడ్డి, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్స్‌ను పరిశీలించిన బిజేపీ నేతలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుల ఆదేశాల మేరకు కడప నగరంలోని ఎస్సీ హాస్టలను బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు డి వెంకటేశ్వర్లు వారి బృందంతో పరిశీలన చేశారు. హాస్టల్లోని మౌలిక వసతులను, మెనూ చాట్ క్రమమును, విద్యార్థుల సౌకర్యాలను ఉపాధ్యాయుల సమక్షంలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వారి సౌకర్యాలు పట్ల సంతోషంగా ఉన్నారన్నారు. ఉపాధ్యాయుల విద్యా బోధనలు కూడా విద్యార్థుల కు ప్రయోజనకరంగా ఉన్నాయన్నారు. ఇలాగే రాష్ట్రంలోని అన్ని ఎస్సి హాస్టల్లో సౌకర్యాలు సౌలభ్యంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు జి కృష్ణ, బిజెపి జిల్లా కన్వీనర్ జి లక్ష్మణరావు, అట్లూరు మండలం బిజెపి ఎస్సీ మోర్చా ప్రెసిడెంట్ అట్లూరు వేణుగోపాల్, అట్లూరు మండల ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి జి రఘురాం అట్లూరు మండలం ఉపాధ్యక్షులు తిరుపాలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అంతిమ విజయం రాహుల్‌దే: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లె: అంతిమ విజయం రాహుల్‌దేని పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు ఆయన విజయవాడ దర్నాచౌక్ వద్ద బుధవారం నిర్వహించిన మౌన సత్యాగ్రహం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి విజయవాడ నుంచి ఫోన్ ద్వారా మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ నేతృత్వంఓ గాంధేయ వాదానికి, మోదీ నేతృత్వంలో గాడ్సే వాదానికి మధ్య సైద్ధాంతిక పోరాటం జరుగుతోందన్నారు. రాహుల్ ఫోబియోతో బిజెపి నాయకులు వణుపుడుతోందన్నారు. రాహుల్‌గాంధీ పార్లమెంటు లోకి ప్రవేశించకుండా బిజెపి నాయకులు కుట్రలు పన్నుతున్నా రన్నారు. ఇందుకు మౌన సత్యాగ్రహం మరో స్వాతంత్ర్య పోరాటా నికి నాంది అన్నారు. రాహుల్‌ను రాజకీయపరంగా దెబ్బతియాల నే ప్రయత్నాలు సాగవన్నారు. ఇందులో భాగమే పరువు నష్టం కేసు, లోక్‌సభలో సభ్యత్వం రద్దు, నివాస బంగళా ఖాళీచేయించడం వంటి దుర్మార్గపు పనులకు బిజెపిని నాయకులు పాల్పడుతు న్నారని తెలిపారు. ఆంగ్లేయులను దేశం నుంచి తరిమకొట్టిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. దేశ సమైక్యత సమగ్రత కోసం ఆత్మబలిదానం చేసిన కుటుంబ నెహ్రూ కటుంబ సభ్యులు అన్నారు. అటువంటి కుటుంబ సభ్యులు ఉడత ఊపులకు భయ పడదన్నారు. బిజెపి అప్రజాస్వామిక చర్యలను ప్రజా కోర్టులోనే ఎదుర్కొంటుందని స్పష్టంచేశారు. అందులో మౌన సత్యాగ్రహం అన్నారు. సమరశీల పోరాటంలో రాహుల్‌గాంధీ విజయం సాధిస్తారని ఆయన విశ్వాసం వ్యక్తంచేశారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర- వేంపల్లె: అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వైఎస్సార్ జిల్లా వేంపల్లె మండలం అలవలపాడులో బుధవారం చోటు చేసుకుంది. ఈ ఆత్మహత్యకు సంఘటనకు సంబంధించి మృతుడి బంధువుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. అలవలపాడులో ఎద్దుల సాంబశివారెడ్డి అను రైతుల వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సాంబశివారెడ్డికి ఐదెకరాల పొలం ఉంది. అందరి రైతుల మాదిరిగా సాంబశివారెడ్డి కూడా వివిధ పంటలను సాగుచేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో పంటల సాగు కోసం అప్పులు చేశారు. కానీ పంటలు సరిగా పండక మరో వైపు అరకొరగా వచ్చిన దిగుబడికి గిట్టుబాటు ధర లభించక ఇత్యాది కారణాల వల్ల సాంబశివారెడ్డి అప్పులపాలయ్యాడు. సుమారు రూ.13లక్షలు అప్పులు చేసినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. అప్పుల ఒత్తిడి ఎక్కువకావడం, అప్పులు తీర్చే విధాయంక లేకపోవడం వంటి కారణాల వల్ల రైతు సాంబశివారెడ్డి మనస్తాపానికి గురయ్యారు. దీంతో రైతు మంగళవారం రాత్రి పురుగుల మందు సేవించారు. అపస్మారక స్థితిలో ఉండిపోయిన సాంబశివారెడ్డిని వైద్యం కోసం మొదట నంద్యాల అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటికే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మార్గమధ్యంలోనే సాంబశివారెడ్డి మరణించాడని వైద్యులు తెలిపినట్లు వారు వెల్లడించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తస్మాత్ జాగ్రత్త.. కడపలో వైసీపీ భూదొంగలు పడ్డారు! : టీడీపీ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : తస్మాత్ జాగ్రత్త కడపలో వైసిపి దొంగలు పడ్డారని కడపజిల్లాలో యథేచ్ఛగా అక్రమ లే-అవుట్ల నిర్మాణం, భూకబ్జాలు జరుగుతున్నాయని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక గాయత్రి టవర్ తన కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కడపలో దొంగ డాక్యుమెంట్లతో భూకబ్జాలు చేస్తూ రెచ్చిపోతున్న వైసీపీ నాయకులు భూకబ్జాలు, అక్రమ లే-అవుట్లు నిర్మాణంలో కడప ఎమ్మెల్యే, మేయర్, కార్పొరేటర్ల హస్తం వుందని మూడేళ్ల కాలంలో కడపలో కేవలం సాయిమిత్ర డెవెలపర్స్ పేరు మీద 90వేల గజాలకు మాత్రమే అధికారిక అనుమతి ఉందని కాని కడపలో నాలుగేళ్లలో ఇన్ని వందల వెంచర్లు, అక్రమ లేఔట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కడపలో మినిస్టర్ లేఅవుట్ పేరుతో అనుమతిలేని కొత్త లేఅవుట్ సృష్టించి, దీనికోసం ప్రైవేట్ భూమి కొని, పక్కనే వున్న ప్రభుత్వ భూమిని కొట్టేసిన వైనం వైసిపి నాయకులు అన్నారు. మంత్రి లేఔట్ కు ఇంకా లాండ్ కన్వర్షన్ కాలేదు, కానీ ఆయన అప్పుడే లే-అవుట్లు వేసి అమ్మకానికి పెట్టారన్నారు. ప్రభుత్వ భూమిని దొబ్బేసి పేదవాడికి అమ్ముతున్న వైసీపీ భూ దొంగలు, కాబట్టి ప్రజలెవరు వైసీపీ భూదొంగలు అమ్మకానికి పెట్టే స్థలాలు, లేఅవుట్లు, భూములు కొనద్దని విజ్ఞప్తి చేశారన్నారు. ఎక్స్ మిలటరీ అధికారుల పేరుతో విచ్చలవిడిగా భూతంధాలు చేసి రెండేళ్ల పనిచేసి ఎక్స్ మిలటరీ రిటైర్ అయిన వారి పేరుపై స్థలాలు సృష్టించి అమ్మకానికి పెడుతున్న వైనం చూస్తే ఈ వైసీపీ పాలనలో ఇంతకన్నా దారుణం ఏమైనా ఉందా అని మండిపడ్డారు. కడప నగరపాలక సంస్థ పరిధిలో అక్రమంగా వెలిసిన అక్రమ లేఅవుట్లను వెంటనే రద్దు చేసి,వాటి పై జిల్లా కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు వెంటనే ఓ కమిటీని వేసి విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులే భూసమస్యల పై సిగ్గులేకుండా పంచాయతీలు చేస్తున్నారని దుయ్యబడ్డారు. కడప ప్రకాష్ నగర్ లోని బద్వేలు ఎమ్మెల్యేకు చెందిన ఫ్లాట్ ను కూడా కబ్జా చేసి అమ్మేశారన్నారు. ప్రజా ప్రతినిధుల స్థలాలకే రక్షణ లేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. కడప ప్రజలు తమ ఆస్తులు, భూములు, ఖాళీ స్థలాలు ఉన్నాయి లేదో తరచూ గమనించుకోండన్నారు. వైసీపీ నాయకులు పట్టపగలే భూ దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. అధికారులు సైతం వైసీపీ నేతలకు వత్తాసు పలుకుతున్నారన్నారు.

విశాలాంధ్ర
వైఎస్ఆర్ కడప జిల్లా



వీఆర్ఏలకు మొండిచెయ్యి చూపిన ప్రభుత్వం

విశాలాంధ్ర-అట్లూరు : "గ్రామ రెవెన్యూ సహాయకుల సంక్షేమ సంఘం" బుధవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ క్యాబినెట్ మంత్రివర్గ సమావేశంలో వి.ఆర్.ఎ. ల సమస్యలు ప్రస్తావనకు రాకపోవడం అన్యాయం అని గ్రామ రెవెన్యూ సహాయకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గుజ్జల ఈశ్వరయ్య. నల్లిపోగు నాగేశంలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ ప్రభుత్వానికి వెన్నుముకైనా రెవిన్యూ శాఖలో చిరు ఉద్యోగులుగా పనిచేస్తున్న వీ.ఆర్.ఏ.లకు పేస్కేల్ ఇవ్వకపోవడం అత్యంత దారుణమని వారు పేర్కొన్నారు. గత నెలలో సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ వారి అధ్యక్షతన జరిగిన చర్చలు వీఆర్ఏలలో ఆశలు నింపాయని ఇకనైనా మా సమస్యలపై ప్రభుత్వం స్పందిస్తుంది అనే ఆశతో ఎదురు చూశారని ఈ ఆశలపై నీళ్లు చల్లుతూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ క్యాబినెట్ సమావేశంలో సుమారు 55 అంశాలు చర్చకు వచ్చినప్పటికీ వీటిలో ఒక్క అంశమైన ప్రభుత్వానికి వెట్టి చాకిరీ చేస్తున్న వీ.ఆర్.ఏ.ల గురించి లేకపోవటం ఈ ప్రభుత్వంలో వి.ఆర్.ఏ.లు చేసుకున్న దౌర్భాగ్యం అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొండిగా వ్యవహరించకుండా నిరుపేద బడుగు బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం సహకరించాలని వి.ఆర్.ఎ.లకు వెంటనే పే స్కేల్ ఇవ్వాలని నామినీలను రెగ్యులర్ చేయాలని 5 సంవత్సరాల సర్వీస్ పూర్తయిన వారికి ప్రమోషన్లు వెంటనే కల్పించాలని లేనిపక్షంలో ఉద్యమాల బాట పట్టి ప్రజాక్షేత్రంలో ఈ ప్రభుత్వాన్ని దోషిగా నిలబెడతామని తెలిపారు.

యర్రగుంట్ల సీఐగా ఈశ్వరయ్య బాధ్యతలు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఎర్రగుంట్ల సీఐగా కె.ఈశ్వరయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు రేంజ్ వీఆర్‌లో ఉన్న ఈశ్వరయ్యను ఇక్కడికి బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న మంజునాధరెడ్డి ఏసీబీ దాడులలో పట్టుబడి కర్నూలులో రిమాండ్‌లో ఉన్న విషయం విదితమే. తాజాగా బాధ్యతలు చేపట్టిన ఈశ్వరయ్య మాట్లాడుతూ శాంతిభద్రతలను సమర్ధ వంతంగా పరిరక్షిస్తామని అలాగే అసాంఘీక కార్యకలాపాల నిర్వహణకు ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు చేపడుతామని స్పష్టం చేశారు.

డ్రైనేజీ కాలువపై నాసిరకపు బండలు : కాంగ్రెస్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కడప నగరానికి ముఖ్య మంత్రి వస్తున్నాడని అత్యవసరంగా ఏర్పాట్లు చేసి డ్రైనేజీ మీద మరి ఎందుకు పనికి రాని నాసిరకపు బండలు వేశారని యువజన కాంగ్రెస్ జిల్లా ఉప అధ్యక్షుడు మదురెడ్డి విమర్శించారు. మంగళవారం సాయంత్రం స్తానిక రాజీవ్ పార్క్ సమీపంలో కాలువ దాటుతున్న వ్యక్తి బండపైన కాలు పెట్టగానే బండ విరగటంతో కాలువలో పడటం జరిగిందన్నారు. అదృష్టవ శాత్తు అతనికి ఏం జరగలేదని, లేకపోతే ప్రమాదం జరిగేదని ఆయన అన్నారు. రోడ్డుకు ఇరువైపులా యేర్పాటు చేసిన పుట్ పాత్ కూడా అంతంత మాత్రంగానే వుందని, ఒక సమాన కొలతలు కూడా లేవని ఆయన అన్నారు. కడప నగర కమీష నర్ ఒకసారి అక్కడ పర్యటించి అలాంటి క్వాలిటీ లేని బండల ని తొలగించి సిమెంటు కాంక్రీటుతో కాలుపైన బండల్ను యేర్పాటు చెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్లబాబు పాల్గొన్నారు.

జీతాలు వెంటనే చెల్లించాలి : ఏపీ ఎస్టిఎఫ్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఇటీవల బదిలీ చెందిన ఉపాధ్యాయులకు కేడర్ స్ట్రెంత్ సరిగా లేక జీతాలు నిలిచిపోయాయని వెంటనే కేడర్ స్ట్రెంత్ అప్డేట్ చేసి జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సప్పరపు రామాంజనేయులు, సందిళ్ళ సుబ్బరాజు యాదవ్‌లు జిల్లా విద్యాశాఖ అధికారిని కోరడమైనది అదేవిధంగా మండల విద్యాశాఖ అధికారి 2, హై స్కూల్ ప్లస్ ఉపాధ్యాయులకు కూడా జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడమైనది. ప్రతిస్పందించిన డీఈవో రాఘవ రెడ్డి త్వరగా పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్టిఎఫ్ నాయకులు ఆవుల రామచంద్ర, ఆలమూరి ప్రసాద్, ఆవుల శ్రీనివాసులు, చంద్రశేఖర్, పసుపులేటి మధుసూదన్ రావు,రామ్మోహన్ రెడ్డి, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా పేదలకు న్యాయం

విశాలాంధ్ర-లింగాల: జగనన్న సురక్ష ద్వారా న్యాయం జరుగుతుందని తహశీల్దార్ లక్ష్మినారాయణ, ఎంపీడీఓ సురేంద్రనాథ్‌లు పేర్కొన్నారు. మండలంలోని వెలిదండ్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా 11రకాల ఉచిత సేవలను అందిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నదే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి కర్నా రమేష్‌రెడ్డి, జగనన్న సురక్ష కన్వీనరు నాగేంద్రారెడ్డి, వైసీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, నాగశేషులురెడ్డి, భాస్కర్‌రెడ్డి, విశ్వరూప జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం

విశాలాంధ్ర-లింగాల: లింగాలలో బుధవారం జనసేనపార్టీ అధినేత పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వాలంటీర్ వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ వైసీపీ నాయకులు, వాలంటీర్లు కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాలంటీర్ల వ్యవస్థను కించపరచే విధంగా పవన్ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాజకీయపరంగా ఆయన ఎన్ని వ్యాఖ్యలు చేసినా తమకేమీ ఇబ్బందిలేదన్నారు. అయితే వృత్తినే దైవంగా భావిస్తూ విధులు నిర్వహిస్తున్న వాలంటీర్లపై నోరుపారేసుకోవడం ఆయన విజ్ఞతకే వదలేస్తున్నామన్నారు. మహిళలకు చేయూతనందిస్తానంటూనే మరో వైపు వాలంటీర్లపై అభ్యంతర వ్యాఖ్యలు చేయడం మంచిదికాదన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కుతీసుకుని తక్షణమే వాలంటీర్లకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

జగనన్న సురక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

విశాలాంధ్ర-జమ్మలమడుగు : జమ్మలమడుగులో బుధవారం ఉదయం 11, 12వార్డులోని సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జమ్మలమడుగు శాసనసభ్యులు డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఏదైతే ప్రజలకు హామీలు ఇచ్చారో అంతకుమించి ప్రజలకు అనేకమైన సంక్షేమ పథకాలతో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ చేసి లబ్ధి చేకూరుస్తున్నారు. గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ప్రజా సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్క రించాలని తెలియచేసారు. అలాగే 11, 12 వ వార్డులో ఇంటి స్థలాలు మంజూరు కాలేదని ఎమ్మెల్యేకి తెలియచేశారు. కొందరు మహిళలకు వితంతు పింఛన్ రాలేదని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి తెలియచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి జగనన్న సురక్ష ప్రోగ్రాముకు వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు తెలియచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్పర్సన్ వేల్పుల శివమ్మ, రెండవ వైస్ చైర్మన్ సింగరయ్య, కౌన్సిలర్ పొచ్చిరెడ్డి, సచివాలయ కన్వీనర్ దంపెట్ల వేణుగోపాల్, పరిశ్రమల డైరెక్టర్ మార్బుల్ శ్రీను, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్సీపీ అభిమానులు, సచివాలయం అధికారులు, వాలంటీర్లు, వైఎస్సార్సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హుల ఇంటికే సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - చెన్నూరు : అర్హులు అయితే చాలు వారి ఇంటికే సంక్షేమ పథకాలు వస్తాయని సికేదిన్నె జడ్పీటీసి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తన యుడు నరేన్ రామాం జుల రెడ్డి అన్నారు. బుధవారం చెన్నూరులోని సచివాలయం-1లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న నరేన్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా వాలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థల ద్వారా నేరుగా వారి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయని పేర్కొన్నారు. చెన్నూరు సచివాలయం-1 లో 1000 అర్జీలు రాగా 935 మందికి అవసరమైన సర్టిఫికెట్లు అందిచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, రామణ శ్రీలక్ష్మి, జిఎన్ భాస్కర్ రెడ్డి, ఆర్ఎస్ రెడ్డి(చిన్న), ముదిరెడ్డి సుబ్బారెడ్డి, పి రఘురామిరెడ్డి, డీసీ ఎంఎస్ ప్రతాపరెడ్డి, ఎర్రసాని మోహన్ రెడ్డి, అబ్దుల్ రబ్బు, వారిష్, చంద్ర యాదవ్, శ్రీనివాసరాజు,నిత్యపూజయ్య, మధుసూదన్ రెడ్డి, కళ్యాణ్, హరి, ఓబులంపల్లి బాబు, చంద్ర, అధికారులు తాసిల్దార్ పటాన్ అలీ ఖాన్, ఎంపీడీవో సురేష్ బాబు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

మండలానికి ఐదెకరాల గ్రౌండ్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర- ఒంటిమిట్ట : మండలం లో దాదాపుగా జడ్పీ స్కూల్స్ 5, కాలేజీలు 3 ఉన్న ఒంటిమిట్ట మండలానికి ఎక్కడా క్రీడాకారులకు 5 ఎకరాలలో గ్రౌండ్ లేదని ఇది బాధాకరమని త్వరలో మండలానికి క్రికెట్ గ్రౌండు సొంత నిధులతో ఇచ్చేందుకు కృషి చేస్తానని రాజంపేట యువ నాయకులు మేడా విజయశేఖర్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఒంటిమిట్ట మండలం కొత్తపల్లి గ్రామంలో ఈనెల 25న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ జరుగుతున్న నేపథ్యంలో ఆట స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మండల పరిధిలో యువకులు క్రీడలు నిర్వహించుకునేందుకు సరైన ఆట స్థలం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ప్రైవేట్ స్థలంలో క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటుకు ప్రోత్సహిస్తూ కొంత ఆర్థిక సాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా యువ కులు క్రీడలు ఆడుకునేందుకు ప్రభుత్వం సరైన ఆట స్థలం కల్పించలేక పోవడం చాలా బాధాకరమని యువకులను క్రీడలలో ప్రోత్సహించేలా అధికారు లు నాయకులు పనిచేయాలని ఆయన అన్నారు. దిలీప్ కుమార్, యువకులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతేమరి..

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణంలో అంకాలమ్మ గుడి ఎదురుగా ఓ ప్రైవేటు ఆసుపత్రి, ఓ ప్రైవేటు పాఠశాల ఉంది. అక్కడి వెళ్లాలంటే చిన్నపాటి కాల్వ దాటుకుని వెళ్లాల్సి ఉంది. కాల్వపై సిమెంటు రోడ్డు వేశారుకానీ సైడు మాత్రం అలాగే ఉంది. మురుగునీరు ప్రవహిస్తూ ఉంటుంది. ఆ మార్గంలో జాగ్రత్తగా గమనిస్తూ వెళితే పర్వాలేదు. ఆదమరిస్తే కాల్వలో పడిపోయే అవకాశం ఉంది. ఈ పరిస్థితి చాలా కాలం నుంచి ఉంది. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదనే వారు కొందరు. ఇదిలావుండగా పులివెందుల పట్టణాన్ని మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం జగన్ ప్రత్యేక దృష్టి సారించి ఆ మేరకు నిదులు కూడా పుష్కలంగా విడుదల చేస్తున్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే మురుగుకాల్వలను సిమెంటుతో కప్పివేయాల్సిన అవస రం ఉంది. అధికార యంత్రాంగం స్పందించి అంకాలమ్మగుడి ఎదురుగా పొంచి వున్న మురుగుకాల్వను సిమెంటు ద్వారా మూసివేయాలని స్థానికులు కోరుతున్నారు.

యర్రగుంట్ల పురపాలికకు స్కాచ్ అవార్డు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా సకాలంలో ప్రజలకు అందిస్తున్న నేపథ్యంలో స్థానిక పురపాలికకు స్కాచ్ అవార్డు దక్కనుంది. ఈ మేరకు ఈ నెల 19వ తేదీన జరుగనున్న జూరి వెరిఫికేషన్‌కు స్థానిక అధికారులకు ఆహ్వానం అందింది. ఆ రోజు జరిగే పర్చువల్ సమావేశానికి మున్సిపల్ కమీషనర్ పగడాల జగన్నాథ్ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డితో భేటీ అయిన కమీషనర్ జగన్నాథ్ అవార్డు అంశంపై చర్చించారు. పురపాలికకు దక్కిన గౌరవం వెనుక యంత్రాంగం, సిబ్బంది కృషి ఎంతో ఉందని చైర్మన్ కితాబిచ్చారు. భవిష్యత్‌లో కూడా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యసాధనలో యంత్రాంగం, సిబ్బంది కృషి చేయడం ద్వారా పురపాలికకు వన్నె తేవాలని ఆయన ఆకాంక్షించారు. కాగా గత ఏడాది కూడా ఎర్రగుంట్ల పురపాలిక స్వచ్ఛ సర్వేక్షణ్ కింద రాష్ట్ర స్థాయిలో 22వ స్థానంలో నిలిచి గౌరవం దక్కించుకుంది. తాజాగా స్కాచ్ అవార్డు రావడం పట్ల ఇక్కడి అధికారులు, పాలకులు హర్షం వ్యక్తం చేస్తుండగా వారిని ప్రజలు అభినందిస్తున్నా రు. కాగా చైర్మన్‌తో భేటీ అయిన సమావేశంలో ఆర్‌ఓ గంగిరెడ్డి, వైసీపీ సీనియర్ నేతలు దాసరి వెంకటశివారెడ్డి, వెంకటాపురం రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.15 కోట్లతో నూతన ఆర్సీసీ స్ట్రోమ్ వాటర్ డ్రైన్స్ నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మైదుకూరు : మైదుకూరు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే రఘురామి రెడ్డి మాట్లాడుతూ మైదుకూరు మున్సిపాలిటీలో చెర వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నాం ఇందిరమ్మ కాలనీలో 6 కోట్ల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు.వచ్చే సోమవారం నుంచి సిమెంటు రోడ్ల నిర్మాణం ప్రారంభమవుతుంది. బిటి రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాను మైదుకూరు ఎర్ర చెరువు బ్యూటిఫికేషన్ పనులను ప్రారంభించనున్నము.5 ఎకరాలలో పార్కు నిర్మాణానికి సిద్ధం చేశాము త్వరలో పనుల ప్రారంభిస్తాం అన్నారు.గడపగడపకు తిరిగి వార్డు గ్రామ లలో చిన్న మైనర్ పనులను సైతం పూర్తి చేస్తున్నాం చంద్రబాబు హయాంలో ఒక ఇంటికి కూడా స్థలం కేటాయించలేదు.నేడు వేలాదిమందికి ఇంటి స్థలాలు ఇల్లు నిర్మించి టౌన్షిప్ నిర్మిస్తున్నాం. పట్టణంలో తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాం గత నాలుగు సంవత్సరాలుగా మైదుకూరు మున్సిపాలిటీలో నీటి కోసం ట్యాంకర్లను వాడే పరిస్థితి రానీయకుండా చూశాం అన్నారు.ప్రజల వద్దకే పాలన ఉద్దేశంతో ప్రతి ఇంటి సమాచారాన్ని సేకరించేందుకు వాలంటరీ వ్యవస్థ ఏర్పాటు చేశారు.కరోనా సమయంలో ఫీవర్ సర్వే వాలంటరీ వ్యవస్థ ద్వారా త్వరగా సేకరించగలిగాం సచివాల వ్యవస్థ వాలంటరీ వ్యవస్థను ఇతర రాష్ట్రాలు కూడా అభినందించాయి అన్నారు.వాలంటరీ వ్యవస్థ మీద పవన్ కళ్యాణ్ ఆరోపణలు తెలిసి చేశారో తెలియక చేస్తున్నారో అర్థం కావడం లేదు పవన్ కళ్యాణ్ కు ఎవరో చెప్పి చేపిస్తున్నారని అనుమానం ఉంది.వాలంటరీ వ్యవస్థను పవన్ కళ్యాణ్ విమర్శించడం సమంజసం కాదు చంద్రబాబు ప్రభుత్వ హయాంలో పెన్షన్లు కావాలంటే జన్మభూమి కమిటీ మీద ఆధారపడి ఉండేది కులం మతం ప్రాంతం పార్టీ చూడకుండా వ్యవస్థ ద్వారా ప్రజలకు అందిస్తున్నారు.వాలంటీర్లు నడవలేక మంచంలో ఉన్న వికలాంగులకు సైతం ఉదయాన్నే వెళ్లి పెన్షన్లు అందిస్తున్నారు.లక్షా ఇరవై వేల కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును వాలంటీర్ల ద్వారా ప్రజలకు అందిస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక ఇప్పుడు మేము ఇస్తున్న పథకాలను ఇవ్వమని చెప్పండి.పేదా మధ్య తరగతి వ్యక్తులకు ఆర్థిక చేయూత ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు.మైదుకూరు మున్సిపాలిటీలో 60 వేల జనాభా ఉంది. కొంతమంది అధికారుల ద్వారా పూర్తి సమాచారాన్ని సేకరించడం కష్టం ఏదైనా సమాచారం కావాలంటే వాలంటరీ వ్యవస్థ ద్వారా పూర్తి సమాచారాన్ని తక్కువ సమయంలో సేకరించవచ్చు అన్నారు. ఈ సమావేశంలో మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణ రెడ్డి, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మదర్ థెరెసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : పోరుమామిళ్లలోని అవర్ లేడీ ఆఫ్ ఫాతిమా పాఠశాలలో మదర్ థెరెసా ఫౌండేషన్ అధ్వర్యంలో నిర్వాహకురాలు చిత్తా ప్రజ్వల రెడ్డి విద్యార్థినిలకు పిరియడ్ సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య వక్తలుగా పాల్గొన్న బ్రయాన్స్ హాస్పిటల్ చిన్నపిల్లల వైద్యురాలు డాక్టర్ మౌనిక రెడ్డి, విదేశీయురాలు టెర్రీ గిల్క్రిస్ట్ మాట్లాడుతూ ప్రతినెలా మూడు రోజులపాటు వచ్చేయి నెలసరి రుతు సమస్యలు సర్వసాధారణమైన కార్యక్రమమని ఈ సమయంలో ఏర్పడే ప్రతి సమస్యకు పరిష్కారం మంచి ఆహారపు అలవాట్లు, పరిశుభ్రత పాటించడమేనని తెలిపారు. ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సేవా సంస్థ నిర్వాహకులు చిత్తా తామస్ రెడ్డి డాక్టర్ గీత ఎరువ సహకారంతో 200 మంది విద్యార్థులకు 200 కామిక్స్ బుక్స్ ఈ కార్యక్రమం అవగాహన కోసం అందజేశారు. ఈ కార్యక్రమంలో విదేశీయులు జాన్, థామస్, ప్రధానోపాధ్యాయురాలు ఆదూరి ఆరోగ్య రాణి, సిస్టర్లు విజయరాణి,జసింత, ఉపాధ్యాయురాలు జానీ, కావేరి, అనిత, మల్లిక పాల్గొన్నారు.

జగనన్నా సురక్షతో ప్రజలకు సత్వర సేవలు

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల పరిధిలో ఉన్న నాగిశెట్టిపల్లె పంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్నా సురక్షతో మన గ్రామాల వారీగా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు గ్రామస్థాయి అధికారులు వాలంటీర్లు మీ ఊర్లోకి రావడం అర్హులైన వారికి సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం అందులో భాగంగానే జగనన్నా సురక్ష ద్వారా ప్రజా సమస్యలను సత్వర సేవలు అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని ఉచితంగా సర్టిఫికెట్లను, కులం సర్టిఫికెట్లు, ఇన్‌కంతో పాటు వివిధ రకాల సర్టిఫికెట్లను ఈ సమావేశంలో లబ్దిదారులకు అందించడం జరుగుతుందని మండల అధ్యక్షులు వీరనారాయణ రెడ్డి పేర్కొన్నారు. అందులో భాగంగానే నాగిశెట్టి పల్లె పంచాయతీలో ఉన్న గ్రామాల వారీగా సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. స్థానిక సర్పంచ్ వాకమల్ల అనంతరెడ్డి ఆధ్వర్యంలో సమస్యలు నిర్వహించడం జరిగిం దన్నా రు. సమావేశం ఉద్దేశించి వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్నా సురక్షతో మీ గ్రామాలలో అధికారులు రావడం సమస్యలను అడిగి తెలుసుకొని సమస్యలు పరిష్కరిస్తారని, అర్హులైన ప్రతి కుటుంబానికి అమలు చేస్తామన్నా రు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి వెంగమునిరెడ్డి, తహసీల్దార్ సవర్ణదేవి, ఈఓపీఆర్డి జాన్‌కెనడి, హౌసింగ్ ఏఈ నాగజ్యోతి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: మున్సిపాల్టీ పరిధిలోని 22వ వార్డులో మహమ్మదీయ కాలనీ 3వ వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ భీమునిపల్లె లక్ష్మిదేవి నాగరాజులు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రూ.15లక్షలతో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణ పనులకు భూమి పూజ చేసి పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో 22వ వార్డు ఇంచార్జ్ హిదాయత్, పోరెడ్డి నరసింహారెడ్డి, కాకర్ల నాగశేశారెడ్డి, కౌన్సిలర్లు వడ్ల ఇబ్రహీం ఖలీలుల్లా, కమాల్‌బాష, నూరీ, వడ్ల దాదాపీర్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

వాలంటీర్ల ముసుగులో వైకాపా నాయకుల ధర్నాలు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రజా సమస్యలను ప్రశ్నించినందుకే ఆయ నపై వాలం టరీల ముసుగులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్రంలో ధర్నాలు, రాస్తారోకో వంటి కార్యక్రమాలతో అలజడి సృష్టిస్తున్నా రని జనసేట పార్టీ నాయకులు మాదాసు మురళీ పేర్కొన్నారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ వారాహి యాత్రలో వాలంట రీలను ఎక్కడ అసభ్య పదజాలంతో దూషించుకున్న ప్రజాసమ స్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే వాటికి సమాధానం చెప్పుకోలేని ఈ ప్రభుత్వం వాలంటరీలను దూషించినట్లు ఒక అద్భుత కల్పన సృష్టించి వారికి నిరసన కార్యక్రమాలు చేయాలని లేనిచో మీ వాలంటరీ ఉద్యోగంలో నుంచి తొలగిస్తామని భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా వారి ముసుగులో వైకాపా నాయకులు రాష్ట్రంలో అలజడి సృష్టించే విధంగా ప్రయత్నిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రొద్దుటూరు, ఎమ్మిగనూరు, కాకినాడ ఇంకా ఎన్నో చోట్ల మహిళలకు మాన ప్రాణాలకు నష్టం వాటిల్లిన స్పందించని మహిళా కమీషన్ ఒక పవన్‌కళ్యాణ్‌కు నోటీసు పంపడం వెనుక అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మహిళా కమీషన్ రాష్ట్రంలోని మహిళల కోసం పని చేస్తుందా లేక ప్రతిపక్షాల గొంతు నొక్కడమా అని ప్రశ్నించారు. పవన్‌కళ్యాణ్ కార్యక్రమాలకు వస్తున్న అశేశ జనాలను చూసి జీర్ణించుకోలేక ముఖ్యమంత్రి మొదలుకొని కిందస్థాయి నాయకుల వరకు సమస్యలను పరిష్కరించకుండా ఆయన వ్యక్తిగత జీవితంపై మాట్లాడుతున్నారంటే వీరిని అసమర్ధ నాయకులు అనాల్నా లేక ఏమనాలో ప్రజలకే అర్థం కావడం లేదన్నారు. ఈ సమావేశంలో జనసేన సైనికులు నాగరాజు, రవి శంకర్‌రెడ్డి, వాసుదేవ్, రమేష్‌రెడ్డి, కిషోర్‌లు పాల్గొన్నారు.

పొదదుర్తి, వెంకటాపురం, యర్రబల్లి, కొత్తపల్లి గ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం

విశాలాంధ్ర - కమలాపురం : మండల పరిధి లోని పొదదుర్తి పంచాయతీలోని వెంకటాపురం, యర్రబల్లి, కొత్తపల్లి గ్రామాల బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకులు ఆధారంలో భవిష్యత్తు కు గ్యారంటీ కార్యక్రమానికి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం యువ నాయకుడు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి హాజరయ్యారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతు తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తుకు ఓట్లు వేయమని అభ్యర్థిస్తూ తెలుగుదేశం అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యము సంవత్సరమునకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితము మహిళలకు 18 సంవత్సరములు పూర్తయిన వారికి నెలకు రూ.1500 వారికి నగదు ఆదవుతుందని తెలిపారు. ఇంటింటికి తిరిగి గ్రామస్థులను కలుసుకోవడం జరుగుతున్నది ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాఘవ రెడ్డి ఆరోగ్య కేంద్రం మాజీ చైర్మన్ జంపాల నరసింహారెడ్డి ఎం వి వెంకటసుబ్బయ్య నియోజకవర్గం ఎస్సీ సెల్ మేరియన్ ప్రసాద్ , క్లస్టర్, యూనిట్ ఇన్చార్జులు బూత్ కమిటీ మెంబర్లు అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఎస్టీ అన్ని రకాల వార్షిక రిటర్న్స్ గడువు పెంపు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : జిఎస్టి చట్టం వచ్చిన తర్వాత ప్రతి వ్యాపారస్తుడు తన వార్షిక టర్నోవర్ సంవత్సరానికి రెండు కోట్లు రెండు కోట్లు దాటిన వాళ్లు కచ్చితంగా జి.ఎస్.టి.ఆర్ 9 మరియు రిటర్న్స్ ప్రతి సంవత్సరము డిసెంబర్ నెల 31వ తేదీ లోపల ఫైల్ చేయవలసి ఉంటుంది. అలాగే కాంపోజిషన్ డీలర్స్ ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెల 30వ తేదీ లోపల వార్షిక రిటర్న్స్ ఫైల్ చేయవలసి ఉంటుంది. అలా చేయని పక్షంలో రోజుకు 200 రూపాయలు ప్రకారం పెనాల్టీ కట్టవలసి ఉంటుంది. 2017-18 సంవత్సరం నుండి 2021-22 వరకు మన రాష్ట్రంలోనే కాకుండా మొత్తం భారతదేశంలో కొన్ని లక్షల మంది ఈ రిటర్న్స్ ఫైల్ చేయలేదు. ఈ రిటర్న్స్ ఫైల్ చేయని వ్యాపారస్తులకు లక్షల్లో పెనాల్టీ, నోటీసులు డిపార్ట్మెంట్ వారు ఇవ్వడం జరిగింది. మన రాష్ట్రంలోనే కాకుండా ఇండియా మొత్తం మీద వివిధ రకాల వ్యాపార సంఘాల నుండి వచ్చిన నివేదికలను ఆధారంగా చేసుకొని లక్షల్లో వస్తున్నటువంటి లేట్ ఫీజును తగ్గించవలసిందిగా 2022 డిసెంబర్ 19వ తేదీన ఆంధ్ర ప్రదేశ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి. షరీఫ్ ఖాన్ నేతృత్వంలో ఢిల్లీలోని జీఎస్టీ కౌన్సిల్ చైర్మన్ వివేక్ జోహరికి మరియు ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కి ఒక రెప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. ఈ రిప్రజెంటేషన్ను ఆధారంగా చేసుకొని 31-03-2023 వ తేదీన నోటిఫికేషన్ నెంబర్ 7/203 ద్వారా జిఎస్టిఆర్ 9,9%జ% ఫైల్ చేయని వారికి 20 వేల రూపాయలు అపరాధ రుసుముతో మరియు జిఎస్టిఆర్ -4 ఫైల్ చేయని వారికి 500 రూపాయలతో 30-06-2023 వరకు గడువును పెంచుతూ ఫైల్ చేయవలసిందిగా నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. మన రాష్ట్రంలోనే కాకుండా భారతదేశం మొత్తం రిటర్న్స్ ఫైల్ చేయని వారు ఉన్నందున వారి యొక్క వినతులను విన్న షరీఫ్ ఖాన్ తిరిగి 22-05-2023వ తేదీన మరియు 06-07-2023 వ తేదీన జిఎస్టి కౌన్సిల్‌కు ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కి 31-08-2023 వరకు గడువును పెంచమని అభ్యర్థించడం జరిగింది. ఈ అభ్యర్థనను స్వీకరించి తిరిగి 31-08-2023 వరకు అన్ని రకాల రిటర్న్స్ ఫైల్ చేసుకోవడానికి గడువు పెంచడం జరిగింది. కాబట్టి జిల్లాల్లోని వ్యాపారస్తులు ఎవరైనా రిటర్న్స్ ఫైల్ చేయనివారు ఉన్నట్లయితే వారికి రిటర్న్స్ ఫైల్ చేసుకోవాల్సిందిగా కోరడమైనది. రాష్ట్ర అధ్యక్షులు షరీఫ్ ఖాన్ చేసిన సేవలను గుర్తించి 01-07-2023 గుంటూరులోని క్యాపిటల్ హోటల్ నందు రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన అసోసియేషన్ సభ్యులు షరీఫ్ ఖాన్‌ని ఘనంగా సన్మానించారు.

విశాలాంధ్ర
అన్నమయ్య జిల్లా



కేంద్ర మంత్రి పర్యటన విజయవంతం కావాలి:కలెక్టర్

విశాలాంధ్ర-మదనపల్లి రూరల్: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి చేతుల మీదుగా ఈనెల 13న జరగబోవు స్వస్థ్య హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ ఆదేశించారు. 13న కేంద్ర మంత్రి మదనపల్లెలోని సత్సంగ్ ఫౌండేషన్ వారి స్వస్థ్య హాస్పిటల్ ప్రారంభోత్సవానికి విచ్చేయుచున్న నేపథ్యంలో మదనపల్లెలోని బి టి కాలేజ్ గ్రౌండ్స్ నందు హెలిపాడ్‌కు సంబంధించిన పనులను మరియు స్వస్థ్య హాస్పిటల్ పనులను జిల్లా కలెక్టర్ గిరీష, ఎస్పీ గంగాధర్ తో కలిసి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 13న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి మదనపల్లెకు విచ్చేయుచున్నారని, దీనికి సంబంధించిన పనులను సంబంధిత అధికారులకు అప్పగించామన్నారు. కేంద్రమంత్రి ఈనెల 13న మధ్యాహ్నం రెండు గంటలకి మదనపల్లె హెలిపాడ్ కి చేరుకుంటారని అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా సత్సంగ్ ఫౌండేషన్ వారి స్వస్థ్య హాస్పిటల్ కు చేరుకుంటారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎటువంటి లోపాలు జరగకుండా కార్యక్రమం విజయవంతం అయ్యేలా పనులను చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమం తరువాత రోడ్డు మార్గం ద్వారా హెలిపాడ్ కు చేరుకుంటారని అక్కడ నుంచి తిరుపతికి వెళతారని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ పర్మాన్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యే నవాజ్ భాష, ఆర్డిఓ మురళి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాల పంపిణీ ప్రారంబించిన ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్

విశాలాంధ్ర -రాజంపేట: రాజంపేట మండలంలోని మిట్టమీద పల్లి గ్రామం నందు ఉద్యాన శాఖ - ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు పథకం ద్వారా అన్నమయ్య జిల్లా సూక్ష్మ నీటి సాగు అధికారి వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో 90 శాతం రాయితీతో మంజూరైన డ్రిప్ పరికరాలు యూనిట్ల వాహనాలనూ ఉమ్మడి కడప జిల్లా పరిషత్ చైర్మన్ అకేపాటి అమర్నాథ్ రెడ్డి, రాజంపేట శాసనసభ్యులు మేడా వెంకట మల్లికార్జున్ రెడ్డి చేతుల మీదుగా నియోజకవర్గస్థాయి పంపిణీ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించడం జరిగింది. తదుపరి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్రమంలో డి.ఎం.ఐ.ఓ వెంకటేశ్వర్ రెడ్డితో పాటు హార్టికల్చర్ ఆఫీసర్ జి.సురేష్‌బాబు, జడ్పిటిసి దాసరి పెంచలయ్య, రామ్మోహన్ నాయుడు, ఏ.పి.యం.ఐ.పి సిబ్బంది, ఎమ్.ఐ కంపెనీ ప్రతినిధులు,డీలర్లు, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ,రైతులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందచేసిన ఎంఎల్ఏ

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ముఖ్యమంత్రి సహాయనిధి క్రింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి అందచేశారు.రాయచోటి మాసాపేట కు చెందిన అర్షద్ కు రూ 1.50 లక్షలు, చిన్నమండెం మండలం బోనమల గ్రామం నాగూరివాండ్లపల్లె కు చెందిన బలక మల్లమ్మకు రూ 25 వేలు విలువ చేసే చెక్కులను శ్రీకాంత్ రెడ్డి అందచేశారు.

రాజంపేట పాలశీతలీకరణ కేంద్రాన్ని పునఃప్రారంభించాలి
రాజంపేట కోడూరు పాడి రైతులను ఆదుకోవాలి:ఏఐటీయూసీ

విశాలాంధ్ర -రాజంపేట: రాజంపేట, రాయచోటి ప్రధాన రహదారి అనుకొని ఉన్న మూతపడిన పాలసీతలీకరణ కేంద్రాన్ని ప్రభుత్వం పునః ప్రారంభించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సాంబశివ జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్మెస్ రాయుడు రాజంపేట పట్టణ కార్యదర్శి సికిందర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు.సుమారు 10 ఎకరాల సువిశాల మైదానంలో రాజంపేట -రాయచోటి రోడ్డు ప్రక్కన కూచివారిపల్లికి సమీపంలో ఆంధ్రప్రదేశ్ పాడి పరిశ్రమాభివృద్ధి కార్పొరేషన్ సంస్థ 1978 లో ఏర్పాటు చేసిన పాలశీతలీకరణ కేంద్ర మూతపడి దాదాపు 15 ఏళ్ళు దాటినా ప్రభుత్వాలు పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఇంతవరకు పునః ప్రారంభించాలని ఆలోచన లేకపోవడం సిగ్గుచేటన్నారు. జిల్లాలో కొత్తపరిశ్రమలు నెలకొల్పక పోగా ఉన్న పరిశ్రమలు మూత పడి ఏళ్ళు గడిచి పరిశ్రమల సామాగ్రి తుప్పుపట్టిపోతున్నాయని పాత పరిశ్రమలు పునరుద్ధరణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించి రాజంపేట పాలశీతలీకరణ కేంద్రాన్ని పునఃప్రారంభించి రాజంపేట రైల్వే కోడూరు నియోజకవర్గ పాడి రైతులకు అండగా నిలవాలన్నారు. అన్నమయ్య జిల్లా ఇంఛార్జి మంత్రి పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డి, రాజంపేట రైల్వే కోడూరు నియోజకవర్గాల శాసన సభ్యులు ముఖ్యమంత్రి తో పాత పరిశ్రమలు పునరుద్ధరణ కోసం తగిన నిధులు కేటాయించి పునరుద్ధరణ కోసం ప్రయత్నాలు చేపట్టాలని కోరారు.

రాష్ట్ర భవిష్యత్తుకు భరోసా చంద్రన్న బస్సు యాత్ర

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అలుపెరుగని యోధుడు , నవ్యాంధ్ర నిర్మాణ తొలి రథసారథి, ప్రజల కోసం 18 గంటలు పనిచేస్తున్న నాయకుడు నారా చంద్రబాబు నాయుడు భవిష్యత్తుకు భరోసా చంద్రన్న చైతన్య రథయాత్ర బస్సు బస్సు కార్యక్రమం రాజంపేట నియోజకవర్గంలో జరిగింది. ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, రాయచోటి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ రమేష్ రెడ్డి, రాజంపేట నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ బత్యాల చెంగల్ రాయుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి , కుప్పం నియోజకవర్గం పరిశీలకులు గాజుల ఖాదర్ బాషా, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పర్వీన్ తాజ్ తదితరులు ప్రయాణించారు.

రెండవ విడత ప్రవేశం కొరకు దరఖాస్తులకు ఆహ్వానం

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు పట్టణంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ప్రభుత్వ ఐటిఐ) లో రెండవ విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.రెండు సంవత్సరాల కోర్సులు ఎలక్ట్రీషన్, ఫిట్టర్ మరియు ఒక్క సంవత్సరం కోర్సులు డీజిల్ మెకానిక్, వెల్డర్ కు గాను ఈ నెల 31 వ తేదీ సాయంత్రం లోపు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.దరఖాస్తు చేసుకున్నవారు ఆగష్టు 3వ తేదీ లోపు ఒరిజినల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకుని, ఆగష్టు 3వ తేదీ ఉదయం 10.00 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు రెండు ఫోటోలు, వెరిఫికేషన్ ఫామ్ లతో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ, పీలేరు నందు హాజరు కావలెనని తెలిపారు.

పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దగ్ధం

విశాలాంధ్ర-పీలేరు: కలికిరి ఇందిరమ్మ కాలనీ వద్ద గ్రామ, వార్డు వాలంటీర్ల పై పవన్ కళ్యాణ్ చేసిన సంచలన వ్యాఖ్యలకు నిరసనగా కలికిరి గ్రామ, వార్డు వాలంటీర్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వాలింటర్ల జేఏసీ మాటలాడుతు పవన్ కళ్యాణ్ గుర్తుపెట్టుకో రియల్ హీరోలు వాలంటీర్లు నువ్వు కేవలం సినిమాలో మాత్రమే రీల్ హీరో అని ముక్తకంఠంతో కలికిరిలోని వాలంటీర్లు అన్నారు. ఈ సందర్భంగా వవాలింటీర్లు జేఏసీలు మాట్లాడుతూ వాలంటీర్లు స్వచ్ఛందంగా పనిచేస్తున్నారని అందుకు గుర్తింపుగా తమకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నెలసరి జీతభత్యాలు చెల్లిస్తున్నారని అన్నారు. అలాంటి వాలంటీర్ల వ్యవస్థలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో బొగేష్, వార్డ్ నెంబర్లు ఖాదర భాష,అజయ్, విశ్వనాథ , సోషల్ మీడియా మండల అధ్యక్షులు భాను ప్రకాష్, వాలంటీర్లు విద్యార్థి భాగం నాయకులు మలతోటి నరేష్, కార్యకర్తలు షామీర్ ఖాన్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మోపురి రాజ గోపాల్ రెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర-రామాపురం : మండలములోని నల్లగుట్టపల్లె గ్రామము బి.రాచపల్లెకు చెందిన మోపురి రాజగోపాల్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్ రెడ్డి బుధవారం ఉదయం మోపూరి రాజగోపాల్ రెడ్డిని పరామర్శించి, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు.రాజ గోపాల్ రెడ్డి త్వరగా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అమ్మఒడి చెక్కు పంపిణీ కార్యక్రమం పనులను వేగవంతం చేయండి: కలెక్టర్

విశాలాంధ్ర-మదనపల్లి: జగనన్న అమ్మఒడి మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ ఆదేశించారు. ఈనెల 13న మదనపల్లెలోని టిప్పు సుల్తాన్ గ్రౌండ్స్ నందు రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి మరియు వివిధ ప్రజా ప్రతినిధుల సమక్షంలో జగనన్న అమ్మ ఒడి మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ జిల్లా ఎస్పీ గంగాధర్ తో కలిసి కార్యక్రమం పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకానున్నారని, దీనికి సంబంధించిన పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్ భాష, మదనపల్లి ఆర్డిఓ మురళి, మదనపల్లి మున్సిపల్ కమిషనర్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో పేదల జీవితాలలో వెలుగు నింపిన ముఖ్యమంత్రి:కొరముట్ల

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి పేద బడుగు బలహీన వర్గాలలో వెలుగు నింపారని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు కొనియాడారు. బుధవారం ఎమ్మెల్యే స్వగ్రామం రెడ్డివారిపల్లి గ్రామసచివాలయ పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమములో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైసా ఖర్చు లేకుండా 11 రకాల సేవలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. వృద్ధాప్యంలో అవ్వ, తాతలు, వికలాంగులు బ్యాంకు వద్దకు వెళ్లి పింఛన్ తీసుకోలేరని ప్రధాన ఉద్దేశంతో గ్రామ వార్డు వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి తద్వారా పింఛన్ నగదు అందిస్తున్నామన్నారు. కోడూరు గ్రామ సచివాలయం 5 లో, ఓబులవారిపల్లి మండలంలోని చిన్నఓరంపాడులో, పుల్లంపేట మండలంలోని అప్పారాజుపేట సచివాలయాల పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు అన్న మయ్య జిల్లా వ్యవసాయసలహా మండల్ చైర్మెన్ పంజం సుకుమారెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, జెడ్పి టిసి పాలెంకోట రత్నమ్మ, సర్పంచి బుడిగి శివయ్య, ఉపసర్పంచ్ తోట శివసాయి, ఎంపిడిఓ జాషువా, ఇఓపిఆర్డి సిహెచ్ నాగార్జున రావు, డిప్యూటీ తాహశీల్దార్ అమరేశ్వరి,ఆర్ఐ రాజశేఖర్, ఎమ్మెల్యే పిఎస్ ఎంసి కృష్ణయ్య, కోడూరు పంచాయతీ సెక్రటరీ కె రామ సుబ్బారెడ్డి, గ్రామ సచివాలయ సెక్రెటరీ లు, వాలంటీర్లు జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు.

భవిష్యత్తుకు భరోసా బస్సు యాత్రకు బ్రహ్మరథం
పోటెత్తిన పసుపు దళం-తమ్ముళ్లలో నూతనోత్సాహం

విశాలాంధ్ర-రాజంపేట: టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భవిష్యత్తుకు బ్రహ్మరథం బస్సుయాత్ర బుధవారం రాజంపేటకు చేరుకుంది. ఈ బస్సు యాత్రకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దీంతో రాజంపేట పురవీధులలో పసుపుదళం పోటెత్తింది. మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రైల్వేకోడూరు, వీరబల్లి, రాజంపేట, నందలూరు కు చెందిన పార్టీ ఇన్చార్జులు, క్లస్టర్ ఇన్చార్జులతో ఎస్సార్ పాలెం వద్ద ప్రారంభమైన ఈ యాత్రలో టీడీపీ అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొని 2024లో అధికారం తమదేనన్న ధీమాను వ్యక్తం చేశారు. ఎస్ ఆర్ పాలెం నుంచి యాత్ర కూచి వారి పల్లి లోని ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించి భోజనానంతరం తిరిగి యాత్రను ప్రారంభించి పాత బస్టాండ్ కూడలి లోని ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకొని పూలమాలతో నివాళులర్పించారు. అక్కడి నుంచి యాత్రను తిరిగి ప్రారంభించి బోయిన పల్లిలో పెద్ద ఎత్తున బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ యాత్రతో తెలుగు తమ్ముళ్లలో నూతనోత్సాహం పుంజుకుంది.

ఇద్దరు నేతలు విడివిడిగా యాత్రకు..

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల రాయుడు, సీనియర్ నాయకులు చమర్తి జగన్మోహన్ రాజులు వేర్వేరుగా బస్సు యాత్రలో పాల్గొన్నారు. బత్యాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున టిడిపి శ్రేణులు ఎస్ఆర్ పాలెం వద్దకు చేరుకున్నారు. జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలో భారీ ఎత్తున యువత, టిడిపి శ్రేణులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇద్దరు నేతలు విడివిడిగా యాత్రలో పాల్గొన్నప్పటికీ సానుకూల దృక్పథంతో, ప్రశాంత వాతావరణంలో యాత్రను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నియోజవర్గ సీనియర్ నాయకులు, ప్రముఖ విద్యావేత్త చమర్తి జగన్మోహన్ రాజు మాట్లాడుతూ రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమేనని., ఇందుకు నిదర్శనం ఈ జన సందోహమేనని అన్నారు. టిడిపి ప్రకటించిన మినీ మేనిఫెస్టో ను ప్రజలు స్వాగతిస్తున్నారని, అందుకే ప్రజలు యాత్రకు నీరాజనం పలుకుతున్నారని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని., ప్రజలు టిడిపికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోన్ -4 పరిధిలోని చిత్తూరు, రాజంపేట, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి పార్లమెంటులోని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్చార్జిలు, పార్లమెంటు అధ్యక్షులు, రాష్ట్ర పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాన్ని ఏవో తనిఖీ

విశాలాంధ్ర-రామాపురం: మండలం లోని సరస్వతి పల్లి రైతు భరోసా కేంద్రంను అన్నమయ్య జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్ర నాయక్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ లో సాగుచేస్తున్న పంటలపై దృష్టి సారించాలన్నారు. పంట వేసే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు. అదేవిధంగా రైతు భరోసా కేంద్రాలలో ఎరువులు, పురుగు మందులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అదేవిధంగా రైతు భరోసా కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు. పిఎం కిసాన్ నగదు జమ కావాలంటే తప్పనిసరిగా రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి కౌలు రైతుకు కూడా సీసీఆర్సి కార్డులు అందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ మురళీధర్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

ల్యాండ్ కన్వర్షన్‌కు పరిశీలించిన ఆర్డిఓ

విశాలాంధ్ర- రామాపురం: మండలం లోని చిట్లురు గ్రామ పొలం సర్వేనెంబర్ 462/2 -1-25 ఎకరముల భూమి రాయచోటి పట్టణానికి చెందిన యూసుఫ్ ఖాన్ పటాన్ ఖన్లకు సంబంధించిన అగ్రికల్చర్ భూమిని ల్యాండ్ కన్వెన్షన్ కు మార్చాలని దరఖాస్తు చేయడంతో బుధవారం అన్నమయ్య జిల్లా రాయచోటి ఆర్డీవో రంగస్వామి ఆ భూమిని పరిశీలించారు. కార్యక్రమంలో తాసిల్దార్ అరవింద్ కిషోర్. మండల సర్వేర్ నాగలక్ష్మి. మండల రెవిన్ ఇన్స్పెక్టర్ రవికుమార్. వీఆర్వో వెంకట సుబ్బయ్యలు పాల్గొన్నారు.

నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : ఏపీ అంగన్ వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నంద్యాల సరోజమ్మ ఆధ్వర్యంలో కోడూరు నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వై విజయలక్ష్మి, ఉపాధ్యక్షులుగా శోభ, కార్యదర్శిగా కె. నిర్మల, సహాయ కార్యదర్శిగా దీప, కోశాధికారిగా ఎం. శ్యామల, వీరితోపాటు తొమ్మిది మంది సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సరోజమ్మ మాట్లాడుతూ అంగన్వాడి హక్కులను కాపాడుకుందాంమన్నారు. ప్రస్తుతం ఎన్నుకున్న నియోజకవర్గ కమిటి వారు కమిటీని బలోపేతం చేస్తూ అంగన్వాడి టీచర్ల, ఆయాల సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.నాగమణి, ఎం.సుమలత, జి.అరుణ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్ పద్ధతిని సాగు చేసి ఖర్చులు తగ్గించుకోవాలి
- ఎమ్మెల్యే కొరముట్ల

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: వ్యవసాయ రైతులు డ్రిప్ పద్ధతిని సాగు చేసి అధిక ఖర్చులు తగ్గించుకోవాలని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఎంపిడిఓ కార్యాలయ ప్రాంగణంలో నియోజకవర్గ వ్యాప్తంగా 109 మంది రైతులకు 115 ఎకరాలు సాగు కొరకు డ్రిప్పు పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు పథకం (ఏపిఎంఐపి) జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రిప్ పద్ధతి ద్వారా నీరు వృధా కాదన్నారు. నీరు ఆదా కావడమే కాకుండా రైతులకు ఖర్చుల భారం తగ్గిపోతుందన్నారు.రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసిందన్నారు.అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, ఎంపిపి సింగమాల గంగాభవాని, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్దలూరు సుబ్బరామరాజు, ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి పారుదలశాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర రెడ్డి, జడ్పిటిసి పాలెంకోట రత్నమ్మ, జిల్లా కో ఆప్షన్ నెంబర్ వైఎస్ అన్వర్ భాష, ఎంపిడిఓ జాషువా, ఇఓపిఆర్డి సిహెచ్ నాగార్జునరావు,సర్పంచ్ బుడిగి శివయ్య, ఉపసర్పంచ్ తోట శివసాయి,విఫిఆర్ ఖంద్రిక సహకార సొసైటీ చైర్మన్ కొండూరు సుదర్శన్ రాజు, ఉద్యానశాఖ అధికారులు భాస్కర్,అషియా,ఎఒ సుధాకర్, సర్పంచ్ ఆర్వీ రమణ, దామర్ల గణేష్,గల్లా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ బోర్డు లు పంపిణీ

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ఈ రోజు లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో లయన్ మిక్కిలినేని ప్రసాద్ నాయుడు గారి ఆర్థిక సౌజన్యంతో హరి పాపులర్ షూ కంపెనీ నందు దేవపట్ల లో ఉండే జడ్‌పిహెచ్ఎస్ లక్కిరెడ్డిపల్లి ఉర్దూ హై స్కూల్ కు ఆ స్కూల్ హెడ్ మాస్టర్ సుబ్రమణ్యంకి బ్లాక్ బోర్డు లు అందించడం జరిగిందని అధ్యక్షులు లయన్ కె.నిర్మల్ కుమార్ తెలిపారు. అనంతరం దాత లయన్ మిక్కిలినేని ప్రసాద్ నాయుడు గారు మాట్లాడుతూ తన వంతుగా ప్రజలకు ఉపయోగపడే సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఈరోజు దేవపట్ల లో జడ్పీ ఉర్దూ హై స్కూల్ బ్లాక్ బోర్డ్ లు అందజేయడం జరిగిందని అలాగే రాబోయే రోజులలో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి నా వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు.

అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-రామసముద్రం: అర్హులైన ప్రతి లబ్దిదారునికి సంక్షేమ పథకాలు అందిస్తామని రామసముద్రం ఎంపీపీ డాక్టర్ బి.ఎం కుసుమకుమారి వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి సర్పంచులు శ్రీనివాసులు రెడ్డి ఆదినారాయణ జెడ్పిటిసి రామచంద్రారెడ్డి సింగల్ విండో అధ్యక్షుడు కేశవరెడ్డిలు తెలిపారు. బుధవారం మండలంలోని కేసి పల్లె ఆర్ నడుం పల్లె గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. సచివాలయ సందర్భంగా వీరు మాట్లాడుతూ అర్హత ఉండి ఇప్పటివరకు సంక్షేమ పథకాలలో లబ్ధి పొందని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష పథకాన్ని తీసుకొచ్చారని చెప్పారు ప్రతి వాలంటీరు గృహసారథులు అలాంటి అర్హులను గుర్తించి వారికి లభించేలా చూడాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో నారాయణస్వామి తహసిల్దార్ ను దైవరాజన్ డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాసులు కన్వీనర్ భాస్కర్ గౌడ్ మాజీ సింగల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి నందకుమార్ రెడ్డి రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు నారాయణస్వామి శివ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-రాజంపేట : అన్నమయ్య జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 31 వ తేదీ లోపు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటిఐ జిల్లా కన్వీనర్, రాజంపేట ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ కే.శ్రీనివాసులు తెలియజేశారు. ఆయన బుధవారం ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రభుత్వ మరియు ప్రైవేటు ఐటిఐ కళాశాలల్లో రెండవ దశ కౌన్సిలింగ్ కొరకు అంతర్జాలంలో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఆన్లైన్ ద్వారా జరుగు రెండవ విడత అడ్మిషన్ ప్రక్రియ నందు అభ్యర్థులకు ఎటువంటి కాల్ లెటర్లు పంపించడం జరగదని, అభ్యర్థులు ఏ కళాశాలలో ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకున్నారో ఆ కళాశాలకు వెళ్లి ఆగస్టు 8వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో చేరదలచిన విద్యార్థులు ఆగస్టు 3, 4 వ తేదీల లోనూ ప్రైవేటు ఐటిఐ కళాశాలల్లో చేరదలుచుకున్న విద్యార్థులు ఆగస్టు 5,7వ తేదీలలో ఆయా కళాశాలల్లో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు

రాహుల్‌గాంధీకి సంఘీభావం తెలిపిన ఎస్ రెడ్డిసాబ్

విశాలాంధ్ర-మదనపల్లి రురల్: ఏపీసి సి ప్రెసిడెంట్ రుద్రరాజ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన ధర్నా విజయవాడ ధర్నాచౌక్‌లో మౌనదీక్షలో కార్యక్రమంలో మదనపల్లి కాంగ్రెస్ నాయకులు భారీ సంఖ్యలో వెళ్లి సంఘీభావం తెలిపినట్లు మదనపల్లి కాంగ్రెస్ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి కాంగ్రెస్ నాయకులు వై సురేంద్ర రెడ్డి, మహబూబ్ పీర్, సయ్యద్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

బీరం సుబ్బారెడ్డి డీఈఓకు క్షమాపణ చెప్పాలి
మండల ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్

విశాలాంధ్ర -రామాపురం : జిల్లా విద్యాశాఖ జిల్లా అధికారిపై నిందలు మోపుతూ బీరం శ్రీధర్రెడ్డి విద్యాసంస్థ అధినేత బీరం సుబ్బారెడ్డి సోషల్ మీడియాలో ప్రచారం చేయడం సరైంది కాదని అన్నమయ్య జిల్లా రామాపురం మండల ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు విమర్శించారు. బుదవారం రామాపురం మండలంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమా వేశంలో వారు మాట్లాడారు. దుర్ఘటన జరిగిన రోజు జిల్లాలోనే ఉన్న రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఈ విషయంపై ఆరాతీసి ఆ విద్యాసంస్థపై తగు చర్యలు తీసుకో వాలని జిల్లా అధికారులను ఆదేశించారన్నారు. ఎంతో నిబద్ధతతో సేవలందిస్తున్న డీఈవోపై బురద జల్లడం సబబు కాదన్నారు. ఆరోపణలు రుజువు చేయని పక్షంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి కి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కనపర్తి.శివశంకర్ రెడ్డి, కె. కుమార స్వామి, పియండి. రఫీ ,సి.చంద్ర శేఖర్ రెడ్డి, ఎ.రామచంద్ర,యస్.రమేష్ రెడ్డి, డి.మధుసూదన్ రెడ్డి,హెచ్. గంగాధర్,సి.సుబ్బారెడ్డి, రవి ప్రతాప్ ఉన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: జిల్లా వ్యాప్తంగా వర్షాకాలం ప్రారంభమైందని ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి కొండయ్య తెలియజేశారు. బుధవారం శెట్టిపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్ దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ చేశారు. వైద్య సిబ్బందికి వ్యాధి నిరోధక టీకాలు, ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ఎన్సీడీ సర్వే కార్యక్రమాలపై తెలియజేశారు. ఆరోగ్య కేంద్ర పరిధిలో గర్భవతులను గుర్తించి మాతా శిశు మరణాలు జరగకుండా సకాలంలో డెలివరీ కేసులు చూడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బలరామరాజు, దేవపట్ల వైద్యాధికారి ముస్తాక్ అహ్మద్, సూపర్వైజర్ మహమ్మద్ భాషా, హెల్త్ అసిస్టెంట్ కరిముల్లా, 104 సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర
విలేకరులు కావలెను

విశాలాంధ్ర అన్నమయ్య జిల్లాలో దిగువ పేర్కొన్న మండలాలలో పనిచేయుటకు విలేకరులు కావలెను. ఇంటర్మీడియట్ చదివి, తెలుగు భాషా పరిజ్ఞానం కలిగిన వ్యక్తులు అర్హులు.

పనిచేయవలసిన మండలాలు: చిన్నమండ్యం, సంబేపల్లి, పెనగలూరు, చిట్వేల్, పుల్లంపేట, ఓబులవారిపల్లి, కురబలకోట, తంబళ్లపల్లి, పీటీఎం, ములకలచెరువు, బి. కొత్తకోట, నిమ్మనపల్లి, కలికిరి, వాల్మీకిపురం, కలకడ, కె.వి.పల్లి, మదనపల్లి టౌన్, పెద్దమండ్యం.

వ్రాత పరీక్ష తేది: 17-7-2023 , సమయం : ఉ|| 10.30 గంటలకు

స్థలం : ఎన్జీఓ హోమ్, ఆర్టీసి బస్టాండ్ ఎదురుగా, రాయచోటి.

వివరాలకు: 99855 89444

అందుబాటులో వేరుశనగ విత్తనాలు

విశాలాంధ్ర-వాల్మీకిపురం: ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు సకాలంలో వేరుశనగ విత్తనాలను విత్తుకొని పంటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ వాణిశ్రీ, ఏఓ హేమలత, ఆర్బికే చైర్మన్ నీళ్ల భాస్కర్, ఉప సర్పంచ్ కేశవరెడ్డి, నాయకులు చింతల ఆనందరెడ్డి, రఘు, వెంకట్రమణ, కిరణ్ కుమార్, శివారెడ్డి పాల్గొన్నారు.

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ

విశాలాంధ్ర-వాల్మీకిపురం : వాల్మీకిపురం గ్రామదేవత నల్లవీర గంగాభవాని అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా బ్రాహ్మణ వీధికి చెందిన ఉపాధ్యాయ దంపతులు సురేష్, అరుణకుమారి పట్టువస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు రమణారెడ్డి చేతులమీదుగా అమ్మవారికి పట్టువస్త్రాలను అందజేశారు. ప్రతి సంవత్సరం అమ్మవారి జాతరకు పట్టు వస్త్రా లను అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పద్మ, మహేంద్ర, ఆలయ చైర్మెన్ రామ్కుమారెడ్డి, సభ్యులు బలరాం, పూజారి జనార్ధన్, భక్తులు పాల్గొన్నారు.

రైతులు సహకరిస్తే శాశ్వత పరిష్కారం

విశాలాంధ్ర-కలికిరి : భూ రీసర్వేకు రైతులు సహకరిస్తేనే భూ సమస్యలపై శాశ్వత పరిష్కారం దొరుకుతుందని ఆర్డీఓ మురళి తెలిపారు. స్థానిక మండల కేంద్రంలోని కలికిరి, పత్తేగడ పంచాయతీలోని కొర్లగుంట గ్రామాలలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ డ్రోన్ సహాయంతో జరుగుతున్న రీ సర్వే సమయంలో సంబంధిత రైతులు తమ పాస్ బుక్కులు, దస్తావేజులు గాని చూపించి తమకు ఉన్నటువంటి సమస్యలను అధికారుల ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు. చిన్న చిన్న తగాదాలు, భాగ పరి ష్కారాలు, తదితర సున్నితమైన సమస్యలు, లేకుండా అధికారులకు రైతుల సహకరించి ఈ సర్వేకి సహాయ సహకారాలు అందిస్తేనే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. అనంతరం కలికిరి తహశీల్దార్ కార్యాలయంలో జగనన్న కాలనీల పురోగతిపై సమీక్షించారు. జగనన్న లే అవుట్ను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఎఇకి సూచించారు.

టిడిపి అసత్య ప్రచారాలను తిప్పికొట్టండి :ఎంపీ

విశాలాంధ్ర-కురబలకోట: టిడిపి అసత్య ప్రచారాలను తిప్పి కొడుతూ వైసిపిని అధికారంలోకి తీసుకురావడానికి మరోసారి సోషల్ మీడియా సభ్యులు సైనికుల్లా పనిచేయాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని జడ్పీ హైస్కూల్లో ప్రాంగణంలో వైసిపి సోషల్ మీడియా ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజుల్లో సోషల్ మీడియా ప్రజా జీవితంలో అంతర్భాగంగానే కాకుండా నిత్యావసరంగా మారిందని పేర్కొన్నారు. ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతంగా పేరొందిన తంబళ్లపల్లె నేడు అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. తంబళ్లపల్లెలో వేసినన్ని రోడ్లు రాష్ట్రంలో మరెక్కడా వేయలేదన్నారు. టిడిపి నిర్వాకంతో కుట్ర పూరితంగా ఆగిన ముదివేడు ఇతర రిజర్వాయర్ పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు.. ప్రజలకు సమస్యలు ఉంటే ఎమ్మెల్యేతో పాటు తన దృష్టికి కూడా తీసుకు రావచ్చన్నారు. తంబళ్లపల్లెలో పరిశ్రమలు ఏర్పాటు చేయించాలని ఇక్కడి వారు చాలా మంది తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. ఎంత చేసినా ఇంకా చేయాల్సింది ఎంతో ఉందన్నారు. సోషల్ మీడియా సేవలు వెలకట్టలేనివన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి సిఎం జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. ప్రభుత్వ పథకాలను ఊరూ.వాడా చెప్పాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలతో పాటు సోషల్ మీడియా చురుకైన పాత్ర పోషించాలని కోరారు. నియోజక వర్గ పరిశీలకులు ఇరగ్రరెడ్డి ఉమ్మడి జిల్లా గ్రానైట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కారదరెడ్డి, జడ్పిటిసి బైసాని జ్యోతి చంద్రశేఖర్రెడ్డి, బి.కొత్తకోట మహేష్ పాల్గొన్నారు.

ఉలిక్కి పడ్డ మదనపల్లి

- మదనపల్లిలో తీవ్ర కలకలం రేపిన రైతు హత్య..
- పాలు పోసి వస్తుండగా నడి రోడ్డులో కిడ్నాప్..
- పొలాల్లోకి ఎత్తుకెళ్లి చిత్రహింసలు పెట్టి దారుణంగా హతమార్చిన దుండగులు..
- పెనుగులాటలో పడిపోయిన మృతుడి మొబైల్ ఫోన్, చెప్పులు..
- దారిలో లేకుండా బైకు ముళ్ల పొదల్లో దాచిన అగంతకులు..

విశాలాంధ్ర- మదనపల్లి: ఇన్నాళ్లు స్తబ్దతగా ఉన్న మదనపల్లి బోడిమల్లు దిన్నెలో మంగళవారం రాత్రి జరిగిన రైతు హత్యతో ఉలిక్కి పడింది. మదనపల్లిలో కలకలం రేపిన రైతు హత్య ఉదంతంపై పోలీసులు మృతుని కుటుంబీకుల కథనం మేరకు..మదనపల్లి మండలం, కొండామరి పల్లి పంచాయతీ, బోడిమల్లు దిన్నెకు చెందిన నారెం సుబ్బ రాఘవరెడ్డి కుమారుడు ఎన్. రాజశేఖర్ రెడ్డి అలియాస్ రాజారెడ్డి(62) వ్యవసాయ పొలంలోనే ఇంటిని నిర్మించుకుని జీవనం సాగిస్తూ భార్య జ్యోతి, పిల్లలు బిందు, కీర్తిలను పోషించు కుంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం గ్రామానికి వెళ్లి పాలు పోసి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 7.30 గంటల సమయంలో ఇంటికి వచ్చే దారిలో నడి రోడ్డుపై రైతును అడ్డగించి బలవంతంగా కిడ్నాప్ చేశారు. దుండగులతో పెనుగులాడిన రాజశేఖర్ రెడ్డి మొబైల్ దారిపక్కనే పడిపోయింది. చీకటి కారణంగా మొబైల్ ఫోన్, చెప్పులు వదిలేసికిడ్నాప్ చేసుకుని సమీపంలోని బీడు పొలాల్లోకి ఎట్టుకెళ్లారు. ఎవ్వరికీ అనుమానం రాకుండా ముందుగా రైతు బైకును ముళ్ల పొదల్లో దాచేశారు. రైతును పొలాల్లోకి ఎట్టుకెళ్లిన దుండగులు కాళ్ళు, చేతులు వెనక్కి కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కి రాళ్లతో తలపై కొట్టి చిత్ర హింసలు పెట్టి చంపే శారు. ఘటన స్థలంలో రైతు దుండగులతో పెనుగులాడిన ఆనవాళ్లు స్పష్టంగా వున్నాయి. సుమారు గంటకు పైగా రైతు శత్రువులతో పోరాడినట్లు ఉంది. చివరకు వారి చేతుల్లో దారుణంగా హత్యకు గురైయ్యడు. హత్యకు ఉపయోగించిన టేప్ రోల్ మృతుడి మెడకు చుట్టిన టవల్ అలాగే వదిలేసి నిందితులు సాఫీగా వెళ్లి పోయారు. హత్యకు గురైన రాజశేఖర్ రెడ్డి మృతదేహానికి పంచిన మన నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుష్ఠు నయ మవుతుంది: డాక్టర్ రమేష్ రెడ్డి

విశాలాంధ్ర-పీలేరు: కుష్ఠు వ్యాధికి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన చికిత్స ఉంది. అని డాక్టర్ రమేష్ రెడ్డి అన్నారు.మంగళవారం బొడుమల్లువారి పల్లి లో అనుమానిత కుష్ఠు వ్యాధిగ్రస్తులకు తలుపుల ప్రధాన వైద్యులు డాక్టర్ రమేష్ రెడ్డి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ దురద పెట్టే మచ్చలు,వచ్చి పోయే మచ్చలు,కుష్ఠు వ్యాధి కాదని,ఎవరికైనా శరీరములో ఏ బాగములోనైనా ఒకటి,లేదా ఎక్కువ, చిన్నవి లేదా పెద్ద మచ్చలు, పాలిపోయిన రాగి, ఎరుపు రంగు గల స్పర్శ లేని మచ్చలు, బహుశా కుష్ఠువ్యాధి కావచ్చు వ్యాధి నిర్ధారణ నిమిత్తం డాక్టర్ కి సహకరించి కుష్ఠు రహిత సమాజం నిర్మిద్దామని డాక్టర్,రమేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, ఏయన్ యం.రేనుఖ, వెంకటరత్నం,సుధ,ఆశా కార్యకర్త రెడ్డెమ్మ,పాల్గొన్నారు.

పరిమిత సంతానం ప్రగతికి మూలం: డాక్టర్ చంద్రశేఖర్

విశాలాంధ్ర-పీలేరు:జనాభా పెరుగుదల లో పరిమితిని పాటించినప్పుడే దేశం పురోగతి బాటలో పయని స్తుందని, పీలేరు ప్రాంతీయ ఆసుపత్రి సూపరెండేంట్ డాక్టర్. చంద్రశేఖ ర్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్స వం సందర్భంగా పీలేరు ప్రాంతీయ ఆసుపత్రి ప్రాంగణం నుండి డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సతీష్ వారి ఆధ్వర్యములో అవగా హన ర్యాలీ చిన్న కుటుంభం చింతలేని కుటుంభం" అని నినాదాలు చేస్తూ " ర్యాలీ ప్రారంభించదమైనది.డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఉత్పత్తి అయ్యే మానవ వనరుల ఆధారంగా జనాభా ఉండాలని, అధిక జనాభా కారణంగా కూడు గుడ్డ నీడ కొరత ఏర్పడి ఉన్నత స్థితి నుండి లేని స్థితికి వ్యక్తి జీవనం నెట్టబడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీష్, సిహెచ్ఓ జయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య,విద్యాసాగర్, పర్యవేక్షకులు కుసుమ,చిన్నప్ప,మోహన్, అందరూ ఏ.యన్.యం.లు, సి.హెచ్.ఓ, యం.యల్.హెచ్.పి.లు, ఆశా కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏపీఎన్ఆర్టీఎస్ సభ్యుల సేవలు అభినందనీయం - ఇలియాస్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఈస్ట్ గోదావరి జిల్లా రాజానగరం మండలం, పాత తుంగపురం చెందిన జంపా దుర్గ అనే మహిళా 4 సంవత్సరాల క్రితం కువైట్ ఇంట్లో హౌస్ మెయిడ్ పని కొరకు వచ్చింది. కువైటీ (స్పాన్సార్) ఇంట్లో పని ఎక్కువ కావడం జీతాలు సరిగ్గా ఇవ్వకుండా ఉంటే 2 సం:ల క్రితం ఇంటి నుండి పారిపోయి అక్కడ ఇక్కడ పనిచేసుకుంటూ కుటుంబ సభ్యులకు డబ్బులు పంపిస్తూ ఉండేది. కువైటీ ఈమె పారిపోయిందని కేసు పెట్టడం ద్వారా చెకింగ్లు ఎక్కువ ఉండటం వలన పట్టు పడితే కష్టం అయితుంది అని భావించి ఏపీఎన్ఆర్టీఎస్ ప్రావిజనల్ కో ఆర్డినేటర్ ఎన్.వి. సుబ్బారెడ్డితో కలిసి నా పైన ఇంటి నుండి పారిపోయాను అని కేసు ఉంది పాస్పోర్ట్ కూడా కువైటీ వద్ద ఉంది నా పరిస్థితి బాగులేదు టికెట్ ఖర్చు నేనే పెట్టుకుంటాను నన్ను ఇండియా పంపండి అని అభ్యర్థించింది. ఎన్. వి. సుబ్బారెడ్డి దుర్గను భారత ఎంబసికి తీసుకొని పోయి ఎంబసి అధికారులతో మాట్లాడి అవుట్ పాస్పోర్ట్ తయారు చేపించి 09-07-2023 న ఇండిగో విమానం ద్వారా కువైట్ నుండి బయలు దేరి 10-07-2023 న స్వస్థలానికి చేరింది. ఈ సందర్భముగా ఏపీఎన్ఆర్టీఎస్ డైరెక్టర్ ఇలియాస్ మాట్లాడుతూ కువైట్ ఏపీఎన్ఆర్టీఎస్ ప్రావిజనల్ కో ఆర్డినేటర్ ఎన్. వి. సుబ్బారెడ్డి సేవలు అభినందనీయమని ముఖ్యమంత్రి జగన్ మార్గదర్శకత్వంలో చైర్మన్ మేడపాటి వెంకట్ ఆధ్వర్యములో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారి సమస్యలను పరిష్కరించడములో ఏపీఎన్ఆర్టీఎస్ ముందుంటుందని 91 850002768, 091 850062768 హెల్ప్ లైన్ పని చేస్తుంటాయని సమస్యలు ఏమైనా ఉంటే ఫోన్ చేసి చెబితే పరిష్కార దిశగా ఏపీఎన్ఆర్టీఎస్ ప్రయత్నిస్తుందన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగన్ పాలన

- సంక్షేమ పథకాల రారాజు సీఎం జగన్
- గడప గడపకు సంక్షేమ పథకాలు అందించాలనేదే సీఎం జగన్ ఆశయం
- గడప గడప కు మన ప్రభుత్వంలో ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా జగన్ పాలన సాగుతోందని వైఎస్ఆర్ సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి మున్సిపాలిటీ 20 వ సచివాలయం 27 వ వార్డు పరిధిలో నిర్వహించిన గడప గడప కు మన ప్రభుత్వం లో ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.హరినాథ వీధి, త్యాగరాజ వీధి,కంసల వీధి, దిబ్బల బడి, పాత పోస్ట్ ఆఫీసు వీధి, సుధ సారీస్ సందు, ఆంజనేయులు దేవలం వీధి, ఉంగరాల చెట్టు వీధి,ఓం శాంతి నగర్, గాలివీడు రహదారి, గంగమ్మ గుడి వీధులలో గడప గడపకు మన ప్రభుత్వం ను ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి నిర్వహించారు. తొలుతహరినాథ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాల రారాజు సీఎం జగన్ అని ఆయన పేర్కొన్నారు.గడప గడప కు సంక్షేమ పథకాలు అందివ్వాలన్నదే సీఎం జగన్ ఆశయమన్నారు.ప్రతి గడప కు వెళ్లి ప్రభుత్వ పథకాలును వివరిస్తూ, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ, ప్రజలుతో మమేకమవుతూ, సమస్యల పరిష్కార దిశగా శ్రీకాంత్ రెడ్డ గడప గడప కు మన ప్రభుత్వంను నిర్వహించారు.

ప్రజలతో మమేకం:

వీధులలో అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలును తొలగించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వంగిమల్ల సుధాకర్ తమకు సున్న వడ్డీ,ఆరోగ్యశ్రీ, ఆసరా పథకాలు అందాయని తెలిపారు. గాలివీడు రహదారి మార్గంలోని హాస్పిటల్స్ లలోకి వెళ్లి వైద్యులతో శ్రీకాంత్ రెడ్డి మమేకమయ్యారు. పేద రోగులకు చేయూతనందించాలని శ్రీకాంత్ రెడ్డి కోరారు.

దుకాణ దారులు, వ్యాపారస్థులతో శ్రీకాంత్ రెడ్డి మమేకం..జిల్లా కేంద్రం కావడంతో వ్యాపార అభివృద్ధి జరుగుతోందంటూ శ్రీకాంత్ రెడ్డి ఎదుట వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. త్యాగరాజ వీధిలోని పట్టాభి రామాలయంలో శ్రీకాంత్ రెడ్డి చే స్థానికులు పూజలు నిర్వహించారు. రాయచోటి నీరజ తమకు వైఎస్ఆర్ ఆసరా, సున్న వడ్డీ,అమ్మఒడి పథకాలు అందాయని తెలిపారు.పెద్దపల్లె రెడ్డికుమారి తమకు అమ్మఒడి ద్వారా ఆర్థిక సహాయం అందిందని తెలిపారు. పుట్టా నాగమణి తమకు అమ్మఒడి ద్వారా ఆర్థిక సహాయం అందిందని తెలిపారు. మూడు చక్రాల ట్రై సైకిల్ పంపిణీ: పాత రాయచోటికి చెందిన ముదిరినేము ఎల్లయ్య అనే వికలాంగుడుకు మూడు చక్రాల ట్రై సైకిల్ ను ఎంఎల్ఏ చేతులమీదుగా అందచేశారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన నాయీ బ్రాహ్మణులు: నాయీ బ్రాహ్మణుల సంక్షేమం కోసం జగన్ ప్రభుత్వంకృషి చేసిందంటూ త్యాగరాజ వీధి నాయీ బ్రాహ్మణులు ఎంఎల్ఏ ఎదుటప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చేదోడు కింద షాపులున్న నాయీ బ్రాహ్మణులకు రూ 10 వేలు ఆర్థిక సహాయం అందుతుండడం హర్షణీయమన్నారు.

ప్రజలు, దుకాణదారులు, చిరువ్యాపారులతో శ్రీకాంత్ రెడ్డి మమేకం: వీధులలోని ప్రజలు, దుకాణదారులు, చిరు వ్యాపారులతో శ్రీకాంత్ రెడ్డి మమేకమయ్యారు. వారి సమస్యలపై ఆరా తీశారు. రాయచోటిని జిల్లా కేంద్రం చేయడం వల్ల పట్టణం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతోందని, జిల్లా కేంద్రం సాధనలో మీ కృషి అభినందనీయ మంటూ ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి ని అభినందించారు.

మళ్లీ మళ్లీ జగనన్న ప్రభుత్వమే రావాలి: ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి గడప గడప కు మన ప్రభుత్వంలో వీధులలో పర్యటిస్తున్నప్పుడు మీకు ఏయే పథకాలు అందుతున్నాయి జగనన్న ఇస్తున్న పథకాలు బాగున్నాయా అని అడగ్గా సీఎం జగనన్న అందిస్తున్న పథకాలన్నీ చాలా బాగున్నాయని, అర్హత ఉంటే పథకాలే ఏ ఒక్కరి సిఫారసు లేకుండానే తమ ఇళ్లకే నేరుగా అందుతున్నాయని, ఈ విధంగా పథకాలు అందిస్తుండడం గతంలో ఏ ప్రభుత్వం చేయలేదని, ఇప్పుడు సీఎం అందిస్తున్నారని, మళ్లీ మళ్లీ జగనన్న ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి ఎదుట ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మున్సిపల్ కమీషనర్ గంగా ప్రసాద్, విద్యుత్ శాఖ ఏఈ నాగరాజు, స్థానిక కౌన్సిలర్ పల్లా మాధవీ లత, పల్లా రమేష్, సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, ప్రముఖ వైద్యులు డా బయారెడ్డి,సంఘ సేవకులు లయన్ తులసీశ్వర్ రెడ్డి, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, కొలిమి ఛాన్ బాష,ఫయాజ్ అహమ్మద్, షబ్బీర్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్,సుగవాసి శ్యామ్, జానం రవీంద్ర యాదవ్,మహేష్ రెడ్డి, గౌస్ ఖాన్, అల్తాఫ్, అన్నా సలీం, కో ఆప్షన్ అయ్యవారు రెడ్డి, హజరత్ ఖాదర్ వలీ, భాస్కర్, జిల్లా వ్యవసాయ సలహా సంఘ సభ్యుడు దిన్నెపాడు రవిరాజు, నవరంగ్ నిస్సార్, కొత్తిమీర ప్రసాద్,మాజీ కౌన్సిలర్ ఆనంద రెడ్డి, గంగిరెడ్డి, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, రియాజుర్ రెహమాన్, కొత్తపల్లె ఇంతియాజ్, ముదిరాజ్ యువసేన జిల్లా అధ్యక్షుడు విక్కీ దేవేంద్ర, డీలర్ నాగేంద్ర, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యంపై శిక్షణ

విశాలాంధ్ర-రాయచోటి: మ్యాజిక్ బస్ ఫౌండేషన్, ఎస్ సి ఈ ఆర్ టి ఆధ్వర్యంలో మూడు రోజుల డి.ఎస్.జి శిక్షణా తరగతులు స్థానిక డైట్ పాఠశాలలో నిర్వహించారు. అన్నమయ్య జిల్లాలో ఎంపికైన ఉపాధ్యాయులకు ఈ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహించు శిక్షణా తరగతులకు భోజన వస్తువులను కూడా ఏర్పాటు చేసినట్లు డీఈవో శ్రీరాం పురుషోత్తం ఒక ప్రకటనలో తెలియజేశారు.

సర్వాంగ సుందరంగా మున్సిపల్ చిన్న పిల్లల పార్క్ రూపుదిద్దుకోవాలి

- పార్క్ పనులను పరిశీలించిన ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:రాయచోటి పట్టణంలోని డైట్ హాస్టల్ ప్రాంగణంలో నిర్మాణ దశలో ఉన్న మున్సిపల్ చిన్న పిల్లల పార్క్ పనులను బుధవారం ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వాకింగ్ ట్రాక్, పార్క్, చిల్డ్రెన్స్ పార్క్, యోగ కేంద్రం, జిమ్ తదితర నిర్మాణా లపై ఆయన ఆరా తీశారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులుకు ఎంఎల్ఏ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, పల్లా రమేష్, జిల్లా వ్యవసాయ సలహా సంఘ సభ్యుడు దిన్నెపాడు రవిరాజు, అన్నా సలీం తదితరులు పాల్గొన్నారు.

గ్రామవాలంటీర్లపై పవన్ వ్యాఖ్యలను వైసీపీ వక్రీకరించింది

విశాలాంధ్ర-పీలేరు: గ్రామవాలంటీర్ల పై పవన్ చేసిన వ్యాఖ్యలను వైసీపీ వక్రీకరించడం హాస్యాస్పదంగా ఉందని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కలప రవి పేర్కొన్నారు.పవన్ కళ్యాణ్ ఏలూరు సభలో గ్రామ వాలంటీర్ల వ్యవస్థ గురించి మాట్లాడిన మాటలని వక్రీకరి స్తూ వైసీపీ నాయకులు, కార్యకర్తల నిరసనలపైన జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కలప రవి,పీలేరు మండల అధ్యక్షులు మోహన్ కృష్ణ ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో వారు మాటలాడుతు గ్రామ వాలంటీర్ల వ్యవస్థని వైసీపీ ఏ విధంగా పరిమితులకి మించి ఉపయోగిస్తోందో ప్రజా ప్రయోజనాలని ఏ విధంగా దెబ్బ తీయగలరో క్షుణ్ణంగా వివరించారని అన్నారు. వాలంటీర్ల దగ్గర ఉన్న ప్రజల సమాచారాన్ని ఎంత వరకు గోప్యంగా ఉందొ తెలియని పరిస్థితులు ఉన్నాయన్నారు. వారి దగ్గర ఉన్న ప్రజల ఆధార్ వివరాలు, బ్యాంకు వివరాలు, భూముల వివరాలు, ఇతరత్ర వివరాలు సంఘవిద్రోహుల చేతిలో వెళితే తీవ్ర పరిణామాలు చోటు చేసుకోవచ్చని, వాటికి వైసీపీ ప్రభుత్వం భాధ్యత వహిస్తుందని ప్రశ్నించారని అన్నారు. సమావేశంలో కేవి పల్లి అధ్యక్షులు మహేష్, వాయల్పాడు నుండి దేపని ప్రభాకర్, పీలేరు మండల ప్రధాన కార్యదర్శులు పవన్ కుమార్, గజేంద్ర, గాయత్రీ, దిలీప్, నవీన్, హరీష్, కార్యదర్శులు రాంచరణ్, రికేష్, సాయి, వెంకటరమణ,మనోజ్, షఫీ,పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ మాటలను వైసిపి వక్రీకరించి వాలంటీర్లను రెచ్చగొట్టడం తగదు : జనసేన

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: జనసేనపార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మాటలను కొంతమంది వైసిపి నాయకులు వక్రీకరించి వాలంటీర్లను రెచ్చగొట్టి పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం తగదని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దగ్ధం చేసినందుకు బుధవారం ఉదయం జనసేనపార్టీ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహానికి పాలాభిషేకం చేసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ వాలంటీర్లకు వ్యతిరేకం కాదు, అనుకూల మన్నారు. వాలంటీర్లు చేత ఎక్కువ పని చేయించుకుంటూ తక్కువ గౌరవేతనం ఇస్తున్నారు అది సరిపోదు 15వేల రూపాయలు నుండి 20వేల రూపాయలు వరకు ఇవ్వాలని పవన్ కళ్యాణ్ మాట్లాడారే గాని ఇంకేమీ పోల్లెత్తి మాట మాట్లాడలేదన్నారు. కొంతమంది వైసిపి వారు వాలంటీర్లను రెచ్చగొట్టి రోడ్డుమీద ధర్నాలు, దిష్టిబొమ్మలు దగ్ధం చేయడం లాంటి కార్యక్రమాలు చేపట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం సరికాదన్నారు. మా నాయకుడు పవన్ కళ్యాణ్ వాలంటీర్లను ఎమీ మాట్లాడుకున్న అనవసరంగా పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మలను దగ్ధం చేసినా, విమర్శించినా మేము కూడ మీలాగే జగన్ రెడ్డి దిష్టిబొమ్మలను దగ్ధం చేయాల్సి వస్తుందని వైసిపిని హెచ్చరించారు. జనసేన పార్టీ నాయకులు పగడాల వెంకటేశు, జోగినేని మణి, పరికూటి నాగరాజు, సర్పంచ్ కారుమంచి సంయుక్త, ముద్దపోలు రామసుబ్బయ్య, దాసరి వీరేంద్ర, బీదం నవీన్ కుమార్, గుగ్గిళ్ళ సుబ్బరాయుడు, నల్లంశెట్టి యానాదయ్య, కనుపర్తి శంకరయ్య, పగడాల చంద్రశేఖర్, సవరం సాయి, శ్రీకారం ప్రకాష్, సింగిరి శివమ్మ, కుప్పాల జ్యోతి, నగిరిపాటి మహేష్, బల్లేపల్లి శీను, కొండేటి వెంకటరమణ, ముత్యాల కిషోర్, ఉత్తరాది శివకుమార్, అంకిశెట్టి మణి, పగడాల మణి ప్రసాద్ తదితరులు పాల్గొని శాంతియుతంగా పెద్ద ఎత్తున నిరసన తెలిపారు.

అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత టిడిపి నాయకులు లేదు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత టిడిపి నాయకులకు లేదని వైఎస్ఆర్సిపి నగర అధ్యక్షులు నారపురెడ్డి సుబ్బారెడ్డి కార్పొరేటర్లు అన్నారు. బుధవారం వైఎస్ఆర్సిపి జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనపై తెలుగుదేశం నాయకులు ప్రెస్ మీట్ పెట్టి అభివృద్ధి ఎక్కడ ప్రశ్నించడం సరికాదన్నారు. అభివృద్ధి గురించి మాట్లాడితే గత తెలుగుదేశం ప్రభుత్వంలో మీరంతా చేశారో మేము ఎంత చేసామో చూపిస్తామని చర్చకు సిద్ధమంటూ సవాల్ విసిరారు. కడప నగరం అభివృద్ధి చెందిందే అప్పుడున్న ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోనే కడప నగరం అన్ని విధాల అభివృద్ధి చెందిందన్నారు. బుగ్గ బంక ప్రహరీ గోడ పూర్తి చేయడం వల్ల అక్కడ ఉన్న చుట్టుపక్కల ఉన్నవారు. ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. అలాగే క్యాన్సర్ హాస్పిటల్ మానసిక హాస్పిటల్ రిమ్స్ ను సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గా చేసిన ఘనత వైసిపి ప్రభుత్వం అన్నారు నగరంలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేయడం కనపడలేదన్నారు. అలాగే నగరంలో రోడ్ల విస్తరణ పబ్లిక్ టాయిలెట్స్ రాజు పార్క్ ఇవన్నీ అభివృద్ధి కనపడలేదా అని తెలిపారు. రాబోయే రోజుల్లో టిడిపి కనుమరుగయ్యి పోయే రోజులు దగ్గర పడ్డాయి అన్నారు. జగన్ పరిపాలన శాశ్వతంగా ప్రజల్లో నిలబడి పోయే విధంగా ఉందన్నారు. 70 కోట్లతో దేవుని కడప చెరువు కట్ట ట్యాంకుబండ విధంగా పూర్తి చేస్తామన్నారు. నగర టిడిపి జిల్లా అధ్యక్షునిగా శ్రీనివాస్ రెడ్డి ఐదు సంవత్సరాలు ఉన్నారు ఏం చేశారు నగరానికి అని ప్రశ్నించారు. నగర అభివృద్ధి గురించి మీరు చెప్పినా సరే మేము చెప్పిన సరే ఎక్కడికైనా సిద్ధమని సవాల్సినారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామేశ్వరం చెన్నయ్య ముక్కారపు సుబ్బారెడ్డి షఫీ వైసిపి నాయకులు శ్రీ రంజన్ రెడ్డి మునిశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర-కలికిరి : స్థానిక మండలంలోని అన్ని గ్రామ సచివాలయ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయ రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ జరుగుతుందని వ్యవసాయ అధికారి మమతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సిబ్బంది రైతులకు విత్తనాలు పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా పాటించ వలసిన పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని వ్యవసాయ రైతులకు నారాయణి రకం అందుబాటులో ఉంటుందని, 30 కేజీల బస్తా రూ.1773లు చెల్లించి తీసుకో వలసిందిగా కోరారు. రైతులు వేరుశనగ విత్తనాల కొరకు వచ్చే సమయంలో తమ వెంట ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ వెంట తీసుకునే రావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కి ఆర్థికసాయం

విశాలాంధ్ర-పీలేరు: భవన నిర్మాణ సంక్షేమం కోసం కలికిరి ఎంపీటీసీ బోగేష్ ఏర్పాటు చేసిన హెచ్ యస్ యమ్ సమస్త ద్వారా రోడ్డు ప్రమాదంలో గాయ పడిన గండబోయి నపల్లి గ్రామ సంబంధపడిన లక్ష్మీనారాయణకు ఈరోజు తన వంతు సహాయంగా పదివేల రూపాయలను అందించడం జరిగింది ఇటువంటి గొప్ప కార్యక్రమం నిర్వహించడం పదిమందికి స్ఫూర్తిదాయకం ఇక మీదట కూడా భవన కార్మికులకు ఎటువంటి ఆపద జరిగినట్లయితే ఖచ్చితంగా తన వంతు సాయం అందిస్తానని బోగేష్ తెలియజేశారు.. ప్రతి ఒక్క భవన కార్మికులు కూడా గుర్తింపు కార్డును పొందవలసిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్ యువత భవన కార్మికులు మరియు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపు

విశాలాంధ్ర-వాల్మీకిపురం : ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించు కోవచ్చునని స్థానిక గ్రంథాలయ అధికారి రమాపతి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఫ్యాన్సీ దుస్తుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. పుస్తక విజ్ఞానం జీవిత ఉన్నతికి ఉపయోగ పడుతుందన్నారు. గ్రంథాలయాంలో పాఠ్య పుస్తకాలు, నవలలు, పరిజ్ఞానం పెంపొందించే పుస్తకాలు, పత్రికలు అందుబాటులో ఉన్నాయన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో పరిజ్ఞానం అభివృద్ధి చేసుకోవాలని ఆయన సూచించారు. పోటీల్లో గెలుపొందిన వారికి గ్రంథాలయ వేసవి శిక్షణ ముగింపు రోజున బహుమతులను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు యామిని, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

యు డైస్ను రెండు రోజులలో పూర్తి చేయాలి

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండల పరిధిలోని అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధా నోపాధ్యా యులకు బుధవారం ఒంటిమిట్ట ఎంఆర్సి కార్యాలయంలో యు డైస్ పై ఒంటిమిట్ట మండల విద్యాశాఖ అధికారి జి వెంకటసుబ్బయ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లా డుతూ రెండు రోజులలో డైస్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. యు డైస్లోని పాఠశాల, ఉపాధ్యా యుల, విద్యార్థుల సమాచారము కచ్చితత్వంగా ఉండే విధంగా ఉపాధ్యాయుల జాగ్రత్త వహించాలన్నారు. యు డేస్ లోని ప్రతి కాలమును పరిశీలించి, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పూర్తిచేయాలని సూచించారు. ఆధార్ లో తప్పులు ఉన్నట్లయితే విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి ఆధార్ సెంటర్ కు వెళ్లి తప్పులను త్వరగా సరి చేసుకోవాలని సూచించాలన్నారు. ఉపాధ్యా యులకు కచ్చితంగా సమయపాలన పాటించాలని, తప్పనిసరిగా అన్ని రకాల రిజిస్టర్లను నమోదు చేయాలన్నారు. జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుకల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు లెసన్ ప్లాన్, టీచింగ్ డైరీలను కచ్చితంగా నమోదు చేయాలని అన్నారు. జగనన్న గోరుముద్ద నూతన మెనూ ను పాఠశాలలో. పెయింట్ ద్వారా డిస్ప్లే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముకుందా ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు లావణ్య, నరవకాటి పల్లి ఎస్సీ కాలనీ ఉపాధ్యాయులు కృష్ణమాచార్యులు యు డైస్ శిక్షకులుగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

అందుబాటులోకి రాజు గారి రొయ్యల పకోడీ, బిర్యానీ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరంలోని రాజీవ్ పార్క్ నందు రాజు గారి రొయ్యల పకోడీ, బిర్యాని రెస్టారెంట్ ను 20 డివిజన్ ఇంచార్జ్ వైసీపీ నాయకులు శ్రీ రంజన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో ఎంతో ప్రసిద్ధిగాంచిన రొయ్యల పకోడీ, బిర్యాని ని కడప నగరంలో ప్రారంభించడం చాలా సంతోషంగా విషయమని అన్నారు. రొయ్యలు, పీతలు, మెత్తలు, చేపలు వంటకాలతో నగర ప్రజలకు అందించడం ఉన్నట్లు తెలిపారు. అనంతరం రెస్టారెంట్ ప్రొప్రైటర్ వేణు మీడియాతో మాట్లాడుతూ రాజు గారి రొయ్యల పకోడీ, బిర్యానీ కడప నగరంలో ప్రారంభించాము. ఇక్కడ రొయ్యలు పకోడీ ఎంతో ఫేమస్ అన్నారు. ఒకసారి రొయ్యల పకోడీ టేస్ట్ చేస్తే రెస్టారెంట్ వారి మంత్లీ కార్డు తీసుకొని ప్రతిరోజు తినవచ్చు అన్నారు. చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకు అందరూ ఈ రొయ్యల పకోడీ ఇష్టపడతారని ఎటువంటి అనారోగ్య ఇబ్బందులు కలగకుండా ఈ పకోడీ చేస్తామని తెలిపారు. తక్కువ ధరలో రొయ్యలు పీతలు చేపలు ఎంతో క్వాలిటీతో అందజేస్తున్నామని తెలిపారు. ప్రజలందరూ ఒక్కసారి మా రెస్టారెంట్కు వచ్చి టేస్ట్ చేసి ఆశీర్వదించి మా వ్యాపారాని దినదిన అభివృద్ధి చెందేలా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామేశ్వరం చెన్నయ్య, ముక్కర సుబ్బారెడ్డి, 50 డివిజన్ ఇంచార్జ్ రాజారెడ్డి, వారి కుటుంబ సభ్యులు మిత్రబృందం తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియా అంతుచూద్దాం..

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్కుమార్రెడ్డి

విశాలాంధ్ర-కలికిరి : ఇసుక మాఫియా అంతు చూద్దామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్కుమార్రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. మహల్ ఇసుక రీచ్ను టిడిపి నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి ఇసుక మాఫియా గా మారి అక్రమంగా టిప్పర్లతో ఇతర రాష్ట్రాలైన చెన్నై, బెంగళూరుకు తరలించి కోట్లాది రూపాయలు ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. వారితోపాటు వైసిపి నాయకులు నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని, టిడిపి ప్రభుత్వంలో ప్రజలకు ఉచితంగా ఇసుకను అందిస్తే, ఈ ప్రభుత్వం స్థానికులకు ఇసుక లేకుండా చేసి బయట తరలించి కోట్ల రూపాయలు ఆదాయం గడిస్తున్నారని, అంతేకా కుండా వోల్టా నిబంధనలను అతిక్రమించి భూగర్భ జలాలకు విఘాతం కలిగే విధంగా ఉందన్నారు. గ్రామాలలో తాగునీటికి ఇబ్బందికరంగా మారుతుందని, ఇసుక బావిలో చుట్టుపక్కల గ్రామాల రైతును కూడా పడి పోయి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ అధి కారంలోకి వస్తే ఇసుక మాఫియా పై కమిటీ వేసి అక్రమార్కులను పై క్రిమి నల్ కేసులు నమోదు చేసి అక్రమంగా సంపాదించిన సొమ్ము సొమ్మును రిక వరీ చేస్తామని తెలిపారు.

గంగమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

విశాలాంధ్ర-వాల్మీకిపురం : వాల్మీకిపురం గ్రామదేవత నల్లవీర గంగాభవాని అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అర్చన విశేష అలంకరణలతో పూజలు నిర్వహించారు. పోతురాజు విగ్రహానికి పూజలు నిర్వహించి, జాతర చాటింపు వేశారు. గంగాజలాలతో మహిళలు ప్రదర్శనగా పురవీధుల్లో తిరిగి స్థానిక బజారు వీధి, నాయక వీధి ప్రాంతాల్లోని గంగరాళ్లకు జలాభిషేకం నిర్వహించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రమణారెడ్డి, కమిటీ చైర్మన్ రాంకుమార్ రెడ్డి, సభ్యులు కేశవ రెడ్డి, బలరాం, విజయవర్మ, రవి, మహేష్, శివ, పూజారి జనార్ధన్, మాజీ జడ్పీటీసీ చింతల శివానంద రెడ్డి, ఆర్ఎబికె చైర్మెన్ నీళ్లభాస్కర్, భక్తులు పాల్గొన్నారు.

చుక్కల సమస్యలకు చక్కటి పరిష్కారం : 'చింతల'

విశాలాంధ్ర-వాల్మీకిపురం : ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న చుక్కల భూముల సమస్యకు సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చక్కటి పరిష్కారం చూపించారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో చుక్కల భూముల రైతులకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 4026 మంది రైతులు చుక్కల భూముల సమస్యతో బాధపడ్డారని, ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చుక్కల భూముల రైతులు పడుతున్న ఇబ్బందులను గమనించి చుక్కల భూములకు చక్కటి పరిష్కారం చూపారన్నారు. దీంతో చుక్కల భూములను సైతం రిజిస్టర్ చేసుకోవచ్చునని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్, నాయకులు చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి, రఘు, అబ్దుల్ కలీమ్, శివా రెడ్డి పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ మానవత్వంతో మాట్లాడితే నిరసనలా?

- వైసిపి నాయకులు రెచ్చగొడితే తడాఖా చూపిస్తాం
- రాజంపేట జనసేన ఇన్చార్జి మలిశెట్టి వెంకటరమణ

విశాలాంధ్ర -రాజంపేట: రాజంపేట నియోజకవర్గంలో వైసీపీ వాలంటీర్ చర్యలకు నిరసనగా పవన్ కళ్యాణ్కి రాజంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ మలిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేయడం జరిగినది. ఈ సందర్భంగా మలిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ ఏలూరు సభలో పవన్ కళ్యాణ్ వాలంటీర్ వ్యవస్థను గురించి మాట్లాడడం జరిగినది కానీ ఈ వైసీపీ వాలంటీర్స్ దాన్ని తప్పుగా అర్థం చేసుకొని పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేయడం పవన్ కళ్యాణ్ ను దుర్భాషలాడటం చేస్తున్నారు. అసలు పవన్ కళ్యాణ్ మాట్లాడడంలో తప్పేముంది వాలంటీర్స్ వైకాపా కార్యకర్తలుగా పనిచేయడం నిజం కాదా వాలంటీర్స్ ప్రజల సమాచారాన్ని గుప్పెట్లో పెట్టుకొని ప్రజలపై టెర్రరిస్టులు లాగా నిగా పెట్టడం లేదా ప్రజల సమాచారాన్ని వైకాపా నాయకులకు అందించడం లేదా కొందరు వాలంటీర్స్ దొంగ సంతకాలు పెట్టుకొని ప్రజల ఆస్తులను కొల్లగొట్ట లేదా బ్యాంకు నుంచి డబ్బులు తీసుకోలేదా యువతులను మానభంగం చేయలేదా అలాగే ఈ వైసీపీ మంత్రి రోజా మంత్రి పదవి తీసుకొని పవన్ కళ్యాణ్ గారిని విమర్శించడానికి పనిచేస్తుందన్నారు. పవన్ కళ్యాణ్ని దుర్భాషలాడుతూ ప్రెస్ మీట్ పెడతా ఉందన్నారు. రాష్ట్రంలో ఏ మంత్రి పదవి ఏదైనా ఉందంటే అది పవన్ కళ్యాణ్ గారిని విమర్శించే మంత్రి పదవి అని రాజంపేట జనసేన పార్టీ ఇన్చార్జి ఈ వైసిపి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర చేనేత కార్యదర్శి రాటాల రామయ్య ,జనసేన నాయకులు భాస్కర్ పంతులు, నంద్యాల హరి, పోలిశెట్టి శ్రీనివాసులు, చౌడయ్య, చంగల్ రాయుడు, గోపాల్, జనసేన వీర మహిళలు జెడ్డా శిరీష ,మాధవి. తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శిగా వై.వెంకటసుబ్బయ్య

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : రాష్ట్రోపాధ్యాయ సంఘం కడప జిల్లా శాఖ కార్యవర్గం బుధవారం సాయంత్రం ఎస్ టీ యు భవన్ నందు సమావేశమై జిల్లా ప్రధాన కార్యదర్శిగా వై.వెంకటసుబ్బయ్య మైదుకూరు గారిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సమావేశంను ఉద్దేశించి రాష్ట్ర బాధ్యులు మల్లు రఘునాథ రెడ్డి,జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి గారులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఎస్టీయు ఒక చుక్కానిలా పనిచేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 12 వ పీఆర్సీ కమీషన్ ను స్వాగతిస్తున్నామని అయితే 11 వ పీఆర్సీ బకాయిలు ఇంతవరకు విడదల చేయలేదని 2019 జులై నుండి 2021 జులై వరకు 54 నెలల డీఏ బకాయిలు చెల్లించకుండా వాటిపై స్పష్టత ఇవ్వకుండా దాటవేత దోరణిలో వ్యవహరిస్తూ ఉండటం భావ్యం కాదని సమావేశం అభిప్రాయ పడింది. పాఠశాల విద్యారంగంలో ప్రధానంగా ప్రాథమిక పాఠశాల వ్యవస్థ నిర్వీర్యం అయ్యే పరిస్థితి ఏర్పడిందని ఈరోజు ప్రతి మండలంలో సగానికి పైగా పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయని బదిలీలు,పదోన్నతులు తరవాత నియమకాలు చేపట్టకపోవడం విద్యారంగానికి నష్టం కలిగిస్తుందని త్వరితగతిన డీఎస్సీ ప్రకటించి నియామకాలు పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు సురేష్ బాబు,గురుకుమార్,ఇలియాస్ భాషా, వెంకట సుబ్బయ్య,సంగమేశ్వర రెడ్డి, రవిశంకర్ రెడ్డి,మహబూబ్ భాషా, శివారెడ్డి, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.